

గత ఏడాది అక్టోబరు 29న వెలిగొండ ఫీడర్ కాలువను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు (ఫైల్)

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. అత్యంత కీలకంగా భావిస్తున్న ఫీడర్ కాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అందుకు అవసరమైన రూ.456 కోట్లను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెలిగొండపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి నిధులకు భరోసా ఇచ్చిన 20 రోజులకే ఆ ఉత్తర్వులు వెలువడ్డాయి. తద్వారా వచ్చే ఏడాది ఆగస్టు ఆఖరు నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిపై సీఎం చెప్పున్న హామీకి అనుగుణంగా చర్యలు కనిపిస్తున్నాయి.

మరో ముందడుగు

వెలిగొండ ఫీడర్ కాలువ పనులకు రూ.456 కోట్లు మంజూరు

- లైనింగ్, కాంక్రీట్ గోడల నిర్మాణం
- సీఎం సమీక్ష జరిగిన 20 రోజులకే ఉత్తర్వులు జారీ
- గత ఏడాది అక్టోబరు ఆఖరులో ప్రాజెక్టును సందర్శించిన ఇరిగేషన్ మంత్రి నిమ్మల
- అనంతరం ఒక్కొక్కటిగా కొలిక్కి వస్తున్న పనులు
- వచ్చే ఏడాది ఆగస్టుకు తొలి దశ పూర్తి దిశగా చర్యలు



కట్టపై పెద్ద పెద్ద రంధ్రాలు పడి అధ్వానంగా ఉన్న ఫీడర్ కాలువ

ఒంగోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టు పనులు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. సుమారు 4.43 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించేందుకు ఉద్దేశించి ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10వేల కోట్లకు చేరుకుంది. ఇప్పటి వరకు రూ.6వేల కోట్లు ఖర్చు చేశారు. పలు క్లిష్టమైన పనులు గత టీడీపీ ప్రభుత్వ కాలంలోనే పూర్తయ్యాయి. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నీరివ్వలేకపోయారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెలిగొండపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. పలుసార్లు సమీక్షలు నిర్వహించి లోటుపాట్లను గుర్తించారు. జిల్లా నేతల విజ్ఞప్తి, సీఎం ఆదేశాలతో గత ఏడాది అక్టోబరు 29న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వెలిగొండ ప్రాజెక్టును సందర్శించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఇతర ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులతో కలిసి పనులను పరిశీలించారు. వివిధ సమస్యలను, పనుల్లో లోటుపాట్లను గుర్తించిన ఆయన సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు.

ప్రాజెక్టు పూర్తికి 2,059కోట్లు అవసరం

వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పూర్తి చేయాలంటే రూ.2,059 కోట్లు అవసరమని అంతిమంగా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. 20 రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నత స్థాయిలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా ఈ నిధుల అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. అనుకున్న విధంగా వచ్చే ఏడాది ఆగస్టుకు తొలిదశ పూర్తి చేయాల్సిందేనని అధికారులను ఆదేశించిన సీఎం.. నిధుల కల్పనకు భరోసా ఇచ్చారు. వాటిలో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు ప్రతిపాదించిన రూ.456 కోట్లు మినహా మిగతావి ఇప్పటికే చేస్తున్నవి కనుక కొత్తగా టెండర్లు పిలవాల్సిన అవసరం లేదు. నిధులను పనులు చేసే కొద్దీ.. సహాయ, పునరావాస చర్యల నిధులను నిర్వాసితుల తరలింపు సమయంలో ఇచ్చే అవకాశం ఉంది.

ఫీడర్ కాలువే కీలకం

కృష్ణానది నుంచి టన్నెల్ ద్వారా దోర్నాల మండలం కొత్తూరు వద్దకు చేరే నీరు అక్కడి నుంచి సుమారు 21.80 కి.మీ మేర ఫీడర్ కాలువ ద్వారా నల్లమల సాగర్ (ప్రాజెక్టు)లోకి చేరుతుంది. గతంలో జలయజ్ఞంలో భాగంగా ఆ కాలువను తవ్వారు. అనేక ఏళ్ల క్రితం తవ్వడం, పనుల్లో నాణ్యత లోపంతో ఫీడర్ కాలువ చాలాచోట్ల దెబ్బతింది. భారీ వర్షాలకు కాలువ కట్టలు తెగిపోయాయి. అనేక చోట్ల మట్టిలో బొరియలు (రంధ్రాలు) పడి నీరు నిలిచే పరిస్థితి లేకపోవడం, ఇతరత్రా లోపాలను మంత్రి నిమ్మల తన పర్యటన సమయంలో గుర్తించారు. కాలువ ఉన్న పరిస్థితి ప్రకారం దాని ద్వారా నీరు ప్రాజెక్టుకు చేరే అవకాశం లేదన్న అభిప్రాయానికి వచ్చారు. అందుకు శాశ్వత పరిష్కారం గురించి సమీక్ష సందర్భంగా అధికారులను మంత్రి కోరారు. మొత్తం కాలువను లైనింగ్ చేయడం, అవసరమైన ప్రాంతాలలో కట్టలకు సిమెంట్ గోడల నిర్మాణం అవసరమని అధికారులు నివేదించారు. దీంతో అక్కడి మట్టి నమూనాలు, ఇతర పరీక్షలు చేయించాలన్న మంత్రి నిమ్మల సూచనలతో హైదరాబాద్ నుంచి నిపుణులను పిలిపించి ఆ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫీడర్ పనుల కోసం రూ.456 కోట్లు అవసరమని ప్రాజెక్టు అధికారులు నివేదించారు.

మంత్రి నిమ్మల ప్రత్యేక చొరవ

ఫీడర్ కాలువకు సంబంధించి రూ.456 కోట్లు మంజూరు చేస్తే టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ ఆలస్యమైతే నిర్దేశిత లక్ష్యం లోపు పనులు పూర్తిచేయడం కష్టమని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై సీఎం స్పందించి తక్షణ చర్యలకు సీఎంవో అధికారులను ఆదేశించగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల మరింత చొరవ తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఫీడర్ కాలువ లైనింగ్, సిమెంట్ గోడల నిర్మాణానికి రూ.456 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. తద్వారా వచ్చే ఏడాది ఆగస్టుకు తొలిదశ పూర్తివైపు ప్రభుత్వ చర్యలు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

జిల్లాకు 6.61 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు

- చెన్నై నుంచి నేరుగా మండల కేంద్రాలకు తరలింపు
- త్వరలో డీలర్ల ద్వారా పంపిణీకి చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రేషన్ పంపిణీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం తాజాగా కార్డుదారులకు స్మార్ట్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంపిణీ చేసింది. మన జిల్లాకు శుక్రవారం చెన్నై నుంచి ప్రత్యేక వాహనంలో స్మార్ట్ కార్డులను తీసుకొ



చ్చారు. జిల్లాలో 6.61 లక్షల రేషన్ కార్డులు ఉండగా వాటి స్థానంలో స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నారు. దీన్ని ఏటీఎం కార్డు తరహాలో రూపొందించారు. కార్డుదారుడి ఫొటోతోపాటు కుటుంబ సభ్యులు, ప్రభుత్వ గుర్తింపు ముద్ర మాత్రమే ఉంటాయి. ఆ కార్డు ద్వారా సులభతరంగా రేషన్ దుకాణాల నుంచి సరుకులు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. వేలిముద్రలు పడకపోయినా ఆ కార్డును స్కాన్ చేసి రేషన్ తీసుకోవచ్చు. ఈ స్మార్ట్ కార్డులను చెన్నై నుంచి నేరుగా మండలాలకు వాహనాల్లో చేరుస్తున్నారు. వాటిని తహసీల్దార్ల ద్వారా డీలర్లకు అందజేస్తారు. వచ్చేనెల మొదటివారం లోపు కార్డుదారులకు పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

పశ్చిమంలో జోరు వాన

జలమయమైన గ్రామాలు

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



జమ్మనపల్లి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నిలిచిన వాహనాల రాకపోకలు



దర్శిలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి రూ.40లక్షల కరెన్సీతో మహాలక్ష్మిగా చేసిన అలంకరణ



రూ.9,99,999 విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించిన ఒంగోలులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు

మహాలక్ష్మీ.. నమోనమః

శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. దేవీ నామస్మరణతో ఆలయాలు మార్మోగుతున్నాయి. ఉత్సవాల్లో ఐదోరోజైన శుక్రవారం అమ్మవార్లు శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా అనేక చోట్ల కరెన్సీ నోట్లతో చేసిన అలంకరణలు ఆకట్టుకున్నాయి.

వివరాలు లోపలి పేజీల్లో..



రూ.1.26 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో ధనలక్ష్మీదేవి అలంకారంలో గిద్దలూరులోని కన్యకాపరమేశ్వరి

జీఎస్టీపై ప్రజలకు విస్తృత అవగాహన

- నేటి నుంచి వచ్చేనెల 19 వరకూ వినూత్నంగా ప్రచార కార్యక్రమాలు
- కలెక్టర్ రాజాబాబు ఆదేశం
- మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్

7



డీఎస్సీ ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీలు

- జోనల్, రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు
- ఏడు రకాల అంశాలకు అవకాశం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగింది. గురువారం అభ్యర్థులకు ప్రాథమిక ఎంపిక ఉత్తర్వులు కూడా ఇచ్చారు. అయినప్పటికీ కొందరిలో నెలకొన్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేసి ప్రక్రియ మొత్తం పారదర్శకంగానే జరిగిందని నిరూపించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. డీఎస్సీ అభ్యర్థుల మెరిట్, తిరస్కరణకు గురైన జాబితాలు, ఎంపిక జాబితాలపై అభ్యంతరాలు ఉంటే స్వీకరించనుంది. అందుకోసం జోనల్, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసింది. ఈమేరకు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. జోనల్‌స్థాయి కమిటీకి ఆర్‌జేడీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. జోన్ పరిధిలోని ఇద్దరు డీఈవోలు సభ్యులుగా ఉంటారు. జిల్లాస్థాయి పోస్టులకు సంబంధించి అభ్యంతరాలు, ఫిర్యాదులు ఈ కమిటీలు స్వీకరించి 15 రోజుల్లోపు పరిష్కరించాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయి కమిటీకి విద్యాశాఖ అదనపు డైరెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. డీఎస్సీ కన్వీనర్, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల ఎస్టాబ్లిష్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీల పరిష్కారంపై సంతృప్తి చెందని వారు నేరుగా పాఠశాల విద్య డైరెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. ఆ అభ్యంతరాలను 30 రోజుల్లోపు పరిశీలించి పరిష్కరిస్తారు. ఏడు రకాల అంశాలపై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాకు 1,450 పశువుల షెడ్లు

పశుపోషకులకు ఊతం ఇచ్చేందుకు ఉద్దేశించిన పశువుల షెడ్ల నిర్మాణాన్ని ఈ ఏడాది కూడా ప్రభుత్వం కొనసాగించనుంది. పల్లె పండుగ 2.0 కింద జిల్లాకు 1,450 షెడ్‌లను మంజూరు చేసింది. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నడుస్తోంది. వచ్చే నెల 1నుంచి నిర్మాణాలు ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో డ్వామా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఎంపీడీవోలతో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. సామూహిక మొక్కల పెంపకంపైనా చర్చించారు.

- పల్లెపండుగ 2.0లో కేటాయింపు
- వచ్చేనెల 1నుంచి నిర్మాణాలు ప్రారంభం
- పంచాయతీకి సగటున రెండు
- యూనిట్‌కు గరిష్ఠంగా రూ.2లక్షలు
- సామూహిక మొక్కల పెంపకంపైనా దృష్టి

ఒంగోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ పేరుతో గత ఏడాది గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధులతో పెద్దఎత్తున మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించింది. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చింది. అదే సమయంలో గత టీడీపీ ప్రభుత్వ కాలంలో మినీ గోకులం పేరుతో చేపట్టిన పశువుల షెడ్ల నిర్మాణాలను కూడా గత ఏడాది పల్లె పండుగ పనుల్లో చేపట్టింది. ఉపాధి పథకం మెటీరియల్ నిధుల నుంచి రూ.2.30 లక్షలు యూనిట్ విలువగా నిర్ణయించింది. అందులో పది శాతం లబ్ధిదారుడు భరిస్తే మిగిలిన 90శాతం ఉపాధి నిధుల నుంచి రాయితీగా సమకూర్చింది. ఆ సమయంలో జిల్లాకు 1,075 షెడ్లను కేటాయించింది. డ్వామా, పశుసంవర్ధక శాఖల సిబ్బంది సంయుక్తంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అన్ని అర్హతలు ఉన్నట్లు గుర్తించి 1,025 యూనిట్లను మంజూరు చేశారు. అందులో 833 షెడ్ల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ఈసారి పంచాయతీ యూనిట్‌గా కేటాయింపు

ఈ ఏడాది కూడా పల్లెపండుగ 2.0 కింద పశువుల షెడ్ల పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొద్దిపాటి మార్పులు, చేర్పులతో అమలు చేస్తోంది. గత ఏడాది యూనిట్ విలువ గరిష్ఠంగా 2.30 లక్షలు కాగా ప్రస్తుతం దాన్ని రూ.2 లక్షలకు తగ్గించింది. గతంలో మండలం యూనిట్‌గా తీసుకొని అందులో



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

తీరప్రాంత, ఇతర మండలాలుగా విభజించారు. ఈసారి పంచాయతీని యూనిట్‌గా తీసుకుంటున్నారు. సగటున ఒక్కో పంచాయతీకి రెండేసి వంతున ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లాకు 1,450 యూనిట్లను కేటాయించారు. ఆ ప్రకారం జిల్లాలో 729 పంచాయతీలు ఉండగా సగటున ఒక్కోదానికి రెండేసి రానున్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలో గుర్తింపు ప్రక్రియను ఎంపీడీవోల పర్యవేక్షణలో డ్వామా సిబ్బంది చేపట్టారు. 1,200 యూనిట్ల గుర్తింపు కొలిక్కి వచ్చినట్లు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ శుక్రవారం మండల అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో నిర్ధారణకు వచ్చారు. వచ్చేనెల 1 నుంచి నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఎంపీడీవోలను ఆయన కోరారు. సామూహిక మొక్కల పెంపకంపై కూడా డ్వామా అధికారులు దృష్టి సారించారు.



బ్రహ్మయ్య (ఫైల్)



గురువిష్ణు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి

- పోతవరం వద్ద ఘటన
- ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు
- దసరా సెలవులకు ఇంటికి వస్తుండగా ప్రమాదం

7


బతుకమ్మ సంబరాలలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది

వేడుకగా బతుకమ్మ సంబరాలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. కళాశాల సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి. కళ్యాణి విద్యార్థినులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. సాంస్కృతికశాఖ సంచాలకులు యామిని అమ్మాజీ మాట్లాడుతూ తెలంగాణాలో బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుతారన్నారు. దీనిని పూలపండుగగా చేసుకుంటే ప్రకృతి ఆరాధన దీని ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థినులు బతుకమ్మలను అందమైన ముగ్గుల మధ్యన నిలిపి వలయంగా నిలిచి చప్పట్లుచరుస్తూ బతుకమ్మ పాటలు పడుతూ ఆనందంగా నర్తించారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు ఉన్నారు.

యూత్ హెల్పింగ్ ఆధ్వర్యంలో అన్నదానం

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యూత్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జమ్ముల పాలెం గ్రామానికి చెందిన పూనాటి వెంకటేశ్వర్లు మనుమడు పూనాటి అభిరామ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం అనాథలు, పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఆర్గనైజేషన్‌సభ్యులు దేవరపల్లిచంద్రశేఖర్, మూర్ధ, వినయ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న దృశ్యం

ఘనంగా 'చిలకమర్తి' జయంతి

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):మహాకవి, నాటకకర్త, సంస్కరణవాది చిలకమర్తి లక్ష్మీ నరసింహం 158వ జయంతిని శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి(ఎఫ్ఏసీ) .శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోగ్రంథాలయ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా చిలకమర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

వల్లూరమ్మను దర్శించుకున్న కాణిపాకం ఈవో

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) :చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఈవో పెంచల కిషోర్ శుక్రవారం వల్లూరమ్మను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు.

నానోయూరియా, డీఏపీని ఉపయోగించాలి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు నానో యూరియా, నానో డీఏపీని ఉపయోగించుకోవాలని పారాదీప్ పాస్ఫేట్స్ లిమిటెడ్ సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి ప్రభాకర్ అన్నారు. ఒంగోలు నగరం పెల్లూరు గ్రామరైతులతో ఆయన శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా, డీఏపీకి ప్రత్యామ్నాయంగా నానో యూరియా ,నానో డీఏపీలను పంటలపై పిచికారీ చేయవచ్చన్నారు. పంట దిగుబడుల్లో ఎటువంటి మార్పు ఉండదని, పర్యావరణం కూడా దెబ్బతినదని అన్నారు. వీటి వాడకం వల్ల ఎరువుల ఖర్చులు కూడా పూర్తిగా తగ్గించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి కె.రమేష్‌బాబు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు హిమబిందు గ్రామరైతులు పాల్గొన్నారు.

శనగలకు గిట్టుబాటు ధర కల్పించాలి

టంగుటూరు (కొండపి), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం శనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతు సంఘం నాయకుడు కె.వీరారెడ్డి మాట్లాడుతూ శనగ రైతుల గురించి అటు ప్రభుత్వం, ఇటు ప్రతిపక్షం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోజెస్, టి.రాము, వి.ప్రభాకర్, గద్దల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగనారు సాగుకు బోర్డు అనుమతి తప్పనిసరి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): పొగనారు సాగు చేసిన వ్యాపారులు తప్పనిసరిగా నారుమళ్ల వద్ద పొగాకు బోర్డు అనుమతి పత్రం ప్రదర్శించాలని బోర్డు విజిలెన్స్ అధికారి ఎం.సత్య శ్రీనివాస్ అన్నారు. ఒంగోలు పొగాకు బోర్డు ఒకటి పరిధిలో సాగు చేసిన పొగనారు మళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొగనారు సాగు చేసిన వ్యాపారులతో మాట్లాడుతూ నారు మళ్ల సాగు చేసే వారు విత్తనం రకం, వేలంకేంద్రం పరిధిపేరు, అనుమతిపత్రం, నారు సాగు చేసిన వ్యాపారి పేరు నారుమళ్ల వద్ద ప్రదర్శించాలన్నారు. అదేవిధంగా నారు అమ్మకాలు చేసినప్పుడు రైతుకు నారు అమ్మినట్టు రశీదు ఇవ్వాలన్నారు. రైతులు పొగనాట్లు వేసిన తరువాత ఫారం నెంబరు 2తో పాటు నారుకొనుగోలు చేసిన రశీదును వేలం కేంద్రంలో ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో కందులూరు, యరజర్ల, మర్లపాడు, కొణిజేడు గ్రామాల పొగనారు మళ్ల సాగుచేసిన వ్యాపారులు, రైతులు, వేలం కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతోనే ఉజ్వల భవిష్యత్

సింగరాయకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టూరిజం బోర్డు చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అన్నారు. మండలంలోని కనుమళ్ల పంచాయతీ పరిధిలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషిచేయాలని విద్యార్థినిలకు సూచించారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ ఇంజనీరింగ్ మొదటి ఏడాది నుంచే విద్యార్థినిలు ఆంగ్లంలో పట్టుసాధించాలన్నారు. అనంతరం ఇంజనీరింగ్ ఫస్టియర్‌లో కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏజీకే మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీలు స్వయం పోషకాలుగా మారాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలు స్వయం పోషకాలుగా మారాలని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. గ్రామ పంచాయతీలు సొంత నిధుల పెంపుదలపై మండల పరిధిలోని సర్పంచ్‌లు,కార్యదర్శులు,డిజిటల్ అసిస్టెంట్‌లు,ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఇంటి పన్ను, నీటి పన్నులు, కొళాయి బిగింపు డిపాజిట్‌లతో పాటు వాణిజ్య, వర్తక కేంద్రాలపై పన్ను, లేఅవుట్, భవననిర్మాణ అనుమతుపై వచ్చే పన్నులు,ఫీజు వసూళ్లు, వ్యర్థాల అమ్మకం, చేపల చెరువులు, విద్యుత్ చార్జీలు, వివిధ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటం ద్వారా వచ్చే ఆదాయాలతో మౌలిక సదుపాయాల కల్పన,సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా స్థానిక సుపరిపాలనకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లు ఎన్.మురళీమోహన్, కె.దేవదానం దృశ్య శ్రవణ విధానంలో శిక్షణ నిచ్చారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

ఆదాయవనరులను పెంపొందించుకోవాలి

సంతనూతలపాడు : మండలంలోని పంచాయతీల ద్వారా ఆదాయవనరులను స్వయంగా పెంపొందించుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యా లయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లకు జరిగా శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రిసోర్స్ పర్సన్ ఇన్‌చార్జ్ ఈవోఆర్డీ పి.రవికుమార్, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర

మద్దిపాడు :గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో జ్యోతి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటికి ప్రాధాన్యత నివ్వాలన్నారు.కార్యక్రమంలో సర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహాలక్ష్మి నమోస్తుతే

- నవరాత్రులలో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- వివిధ ప్రదేశాలలో కరెన్సీతో అలంకరణ

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):దసర శరన్నవరాత్రి ఉత్సవాలలో ఐదవ రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అనేక చోట్ల అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి పూజించారు. అదేవిధంగా పలు దేవాలయాలలో మహిళలచే లలితా సహస్ర నామ పారాయణ చేయగా, ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి. ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీ విజయదుర్గాదేవి దేవస్థానం, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, గంటాపాలెం పార్వతీ దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీ పోలేరమ్మ, శ్రీ మహాలక్ష్మి దేవస్థానం, గద్దలగుంట శ్రీ రాజరాజేశ్వరి దేవి త్రిశక్తి పీఠం, మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమం, కొత్తపట్నం రోడ్డు శ్రీ లక్ష్మీనారసింహ స్వామి శ్రీ బాలా త్రిపురసుందరి దేవి ఆలయం, అమలనాధుని వారి వీధి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, సంతపేట, లాయర్‌పేట సాయిబాబా మందిరాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు జరిగాయి. ఇక నగరంలో వడ్డెవానికుంట, గొడుగుపాలెం ఇలా పలుచోట్ల యువకులు బృందాలుగా ఏర్పడి పందిళ్లలో అమ్మవారి భారీ విగ్రహాలను ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు.


బాలాజీరావు పేటలోని పోలేరమ్మ గుడిలో మహాలక్ష్మీ దేవి అలంకరణ



ఒంగోలు కొత్తపట్నం రోడ్‌లోని రాజరాజేశ్వరి ఆలయంలో మహాలక్ష్మిగా అమ్మవారు

కరెన్సీ నోట్లతో అలంకరణ

చీమకుర్తి :దసరా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని హరిహరక్షేత్రంలో వాసవిమాత మహాలక్ష్మి అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు. ఐదులక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.మాజీ మంత్రి శిద్దా రాఘవరావు,లక్ష్మీపద్మావతి కుటుంబ సభ్యులతో కలిసి విశేషపూజలు జరిపారు.పట్టణంలో ఇసుకవాగు సెంటర్‌లో సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయం,నెహ్రూనగర్ కోదండరామ స్వామి ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన అమ్మవారికి విశేషపూజలు జరిపారు.

మహాలక్ష్మీదేవి అలంకారంలో జాలమ్మతల్లి

సింగరాయకొండ : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని కందుకూరురోడ్డు సెంటర్‌లో ఉన్న జాలమ్మతల్లి దేవస్థానంలో ఐదో రోజైన శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రైల్వేస్టేషన్ రోడ్డు సెంటర్‌లోని చెట్టుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

మహాలక్ష్మి అలంకారంలో వల్లూరమ్మ

టంగుటూరు (కొండపి) : వల్లూరమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.


మహాలక్ష్మీ దేవి అలంకరణలో చెట్టుమహాలక్ష్మమ్మ అమ్మవారు


మహాలక్ష్మి అలంకారంలో వల్లూరమ్మ అమ్మవారు

లాభాల్లో సిండికేట్ రైతు సొసైటీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంతనూతలపాడు సిండికేట్ రైతు సొసైటీ రూ.31లక్షల మేర లాభాల్లో ఉన్నట్లు సొసైటీ చైర్మన్ కూకట్ల విజయమ్మ, ఎండీ శంకరప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడులో సిండికేట్ రైతు సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమానికి సొసైటీ చైర్‌పర్సన్ కూకట్ల విజయమ్మ అధ్యక్షత వహించారు. సొసైటీలో రూ.12కోట్ల 50లక్షల వరకు డిపాజిట్లు ఉన్నాయని, సొసైటీ పరిధిలో రూ.40 కోట్ల మేరకు లావాదేవీలు జరుగుతున్నట్లు సొసైటీ ఎండీ శంకరప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో రైతులు పలు విషయాలపై ప్రస్తావించారు. చైర్‌పర్సన్ విజయమ్మ మాట్లాడుతూ సమస్యలను శాసనసభ్యులు బీఎన్‌విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేట్లు చూస్తానని తెలిపారు. సొసైటీ పరిధిలోని రైతుల కోరిక మేరకు గతంలో జరిగిన లావాదేవీలపై ప్రత్యేక విచారణ వేయనున్నట్లు తెలిపారు. సొసైటీలో ఎరువుల వ్యాపారం, రుణాలు, గోల్డ్‌లోన్‌లపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో రుద్రవరం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కూకట్ల శరత్, సొసైటీ డైరెక్టర్లు మల్లవరపు రామకృష్ణారెడ్డి, పెరుగు రాము, రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ కూకట్ల విజయమ్మ

స్టడీ అవర్‌లో విద్యార్థుల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రయివేటు కాలేజీలో విద్యార్థులు ఘర్షణ పడటంతో ఇరువురు గాయపడ్డారు. ఈసంఘటన పేర్నమిట్ట సమీపంలో గల కాలేజీలో గురువారం రాత్రి జరిగింది. ఇద్దరు విద్యార్థుల మధ్య వచ్చిన అభిప్రాయభేదాలు ఘర్షణకు దారితీశాయి. రాత్రి స్టడీ అవర్‌లో ఇద్దరూ గొడవపడ్డారు. అనంతరం రాత్రి పదిగంటల సమయంలో బయటకు వెళ్లిన వారు బాత్‌రూమ్‌లు క్లీన్ చేసే కర్రలతో కొట్టుకున్నారు. దీంతో వారిని తప్పించబోయిన ఓ విద్యార్థికి తలపై గాయాలు అయ్యాయి. గాయపడిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యం ఆసుపత్రికి తరలించింది. ఇరువురు విద్యార్థులకు తలలపై గాయాలు కావడంతో కుట్లు వేసినట్లు సమాచారం. అయితే వారి తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం వచ్చి విద్యార్థులను తీసుకెళ్లారు. ఈమేరకు తాలుకా సీఐ విజయకృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అదే క్రమంలో తమ విచారణలో ఇరువురు విద్యార్థులు ఘర్షణ పడినట్లు తెలిసిందని చెప్పారు. గొడవలకు వ్యక్తి గత కారణాలు అని చెప్పారు.

భార్యను బలవంతంగా తీసుకెళ్లారని భర్త ఫిర్యాదు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కులాంతర వివాహం చేసుకొందని కక్ష పెట్టుకొని ఐదేళ్ల గర్భవతిగా ఉన్న తన భార్యను ఆమె కుటుంబ సభ్యులు బలవంతంగా ఎత్తుకెళ్లారని చదలవాడ గ్రామానికి చెందిన తేళ్ల రత్నకుమార్ అనే యువకుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. బాధితుడు,పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఒంగోలు గుర్రం జాషువా కాలనీకి చెందిన పిన్న రజని, చదలవాడ గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన తేళ్ల రత్నకుమార్‌లు పెద్దలను ఎదురించి ప్రేమ వివాహం చేసుకొని చదలవాడలో నివశిస్తున్నారు.

ఈ క్రమంలో ఐదు నెలల గర్భవతిగా ఉన్న రజినిని ఆమె కుటుంబ సభ్యులు బలవంతంగా ఎత్తుకెళ్లారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తన భార్యను అప్పగించాలని రత్నకుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజియా సుల్తానా తెలిపారు.

హిజ్రాలు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్పీ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించిన హిజ్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు హెచ్చరించారు. ఒంగోలు నగరంలో హిజ్రాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురౌతున్నారని, ఈమేరకు తమకు అనేక ఫిర్యాదులు అందాయని అన్నారు. దీంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని అన్నారు. నగర శివారు ప్రాంతాలలో త్రోవగుంట , కిమ్స్ హస్పిటల్ ప్రాంతం, మార్కెట్ యార్డు, ఎన్‌జీపాడు వెళ్లే రోడ్డులలో పోలీసులు నిత్యం ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేసామని చెప్పారు. రోడ్డు మీద వెళుతున్న బైక్‌లు, లారీ, కార్లను అడ్డగించి డబ్బులు వసూలు చేయడం నేరమని అన్నారు. హిజ్రాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరకుండా కాపాడుకోవచ్చని డీపీవో ఎం.వెంకటేశ్వరరావు అన్నారు.మండలంలోని మండవవారి పాలెం గ్రామంలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవటానికి సహకరించాలన్నారు. వ్యర్థ పదార్థాలను ఇంటి ముందుకు వచ్చు వాహనంలో వేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులలో రోడ్లను పరిశీలించారు. కరపత్రాలను గ్రామస్థులకు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కె .రాజశేఖరరావు, గ్రామసర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు

మధ్యాహ్న భోజనం అమృతభాండాగారం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం సంపూర్ణ పోషకాలు అందించే అమృత భాండాగారమని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ టి. రంగారావు తెలిపారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం మధ్యాహ్నం భోజనంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ విద్యార్థులకు రోజుకో రకమైన మెనూతో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అలీబాబా, అధ్యాపకులు మాధవరావు, ఇతర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది,విద్యార్థులు ఉన్నారు.

అలరించిన శరన్నవరాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఒంగోలు నగరంలో ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. శుక్రవారం రాత్రి స్థానిక మంగమూరు రోడ్డు శ్రీ గాయత్రి మందిరంలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్యాలయం విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యనీరాజనం అబ్బురపరచింది. చక్కటి వేషధారణ, అందుకు తగిన విధంగా ఆహార్యం, హావభావాలను ప్రదర్శిస్తూ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకుల కరతాళధ్వనులందుకుంది. ముఖ్యంగా కాళికా మాతగా, దుర్గాదేవిగా చిన్నారుల వేషధారణలు కనువిందుచేశాయి.

పశ్చిమంలో జోరువాన



ఇళ్లలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకుంటున్న గొబ్బూరు గ్రామస్థులు

● పలు మండలాల్లో జలమయమైన గ్రామాలు ● పొంగిపొర్లిన వాగులు, వంకలు ● రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

మార్కాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పశ్చిమ ప్రకాశంలోని దాదాపు అన్ని మండలాల్లో శుక్రవారం ఉదయం నుంచి జోరుగా వానలు కురుస్తున్నాయి. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో చాలాచోట్ల వాగులు, వంకలు పొంగుతున్నాయి. ఐదు రోజుల కిందట మార్కాపురం డివిజన్‌లో పలుచోట్ల కుండపోత వర్షాలు కురిసాయి. ఆయా ప్రాంతాల్లో మళ్లీ అల్పపీడన ప్రభావంతో వర్షం పడడంతో గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వర్షం ప్రభావం ఎక్కువగా ఉంది. పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లి, గొబ్బూరు, పెద్దదోర్నాల మండలంలోని ఐనముక్కల, చిన్నదోర్నాల తదితర గ్రామాల్లోని వీధులన్నీ నీటితో నిండాయి. మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో వర్షం ప్రభావంతో మిద్దె కూలిపోయింది. జమ్మనపల్లి గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కంభం, బేస్తవారపేట మండలాల్లో కురిసిన వర్షం ప్రభావంతో గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలతో కంభం చెరువుకు సమృద్ధిగా నీరు చేరుతోంది. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి.

● డివిజన్‌లో 171 మిల్లీ మీటర్ల వర్షపాతం

జిల్లాలో పశ్చిమ ప్రకాశంలోనే అల్పపీడన ప్రభావంతో వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 229.4 మిల్లీ మీటర్ల మేర వర్షం కురవగా, మార్కాపురం డివిజన్‌లోనే 171 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పుల్లలచెరువు మండలంలో 45.4, ఎర్రగొండపాలెంలో 38.6, త్రిపురాంతకంలో 22.6, మార్కాపురంలో 21.6 మిల్లీ మీటర్ల మేర నమోదైంది. వాయుగుండం శనివారం తీరం దాటనుంది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ అధికారులను ఆదేశించారు. పరిస్థితి తీవ్రతను బట్టి అవసరమైతే లోతట్టు ప్రాంతాల వాసుల ఇళ్లు ఖాళీ చేయించాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు ఇప్పటికే చేపట్టారు.

● వాగు ఉధృతం..

మార్కాపురం రూరల్ : మండలంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి జమ్మనపల్లి గ్రామం వద్ద ముద్దసానమ్మ ఆలయ సమీపంలో వాగు ఉధృతంగా ప్రవహించింది. మార్కాపురం నుంచి గుండంచర్లకు రాకపోకలు నిలిచిపోయాయి. వీధులన్నీ జలమయమయ్యాయి. వరి, జొన్న, పత్తి సుమారు 10 ఎకరాలు నీట మునిగాయి. వరద నీటితో చెరువు నిండింది.



కొలభీమునిపాడులో కూలిన మిద్దె

అంతా అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్పీ మాట్లాడుతూ నదులు, వాగులు, వంకలు, చెరువుల వద్ద పోలీసు పికెట్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అవసరమైయితే పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అన్నారు. అత్యవసర పరిస్థితిలో తక్షణ సహాయం కోసం 112, 91211 02266 నంబరు లేదా సమీప పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

వర్షానికి కూలిన మిద్దె స్లాబు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం మండలంలో శుక్రవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి కోలభీమునిపాడు గ్రామంలో మిద్దె స్లాబు కూలింది. ఆ సమయంలో ఇంట్లో వరండాలో పడుకున్న ఇంటి యజమాని డోలు కిరణ్ వెంటనే అప్రమత్తమై బయటకు పరుగు తీశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వంటపాత్రలు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి.

ట్రిపుల్‌ఐటీ భవన నిర్మాణానికి
రూ.200కోట్లు కేటాయించాలి

● అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



కనిగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి ప్రాంతానికి మంజూరైన ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణానికి వెంటనే రూ.200 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కోరారు. ఈ ప్రాంత విద్యార్థులు సరైన వసతులు లేక చదువులు కోసం వలస బాట పడుతున్నారన్నారు. శుక్రవారం అమరావతిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కనిగిరి ప్రాంతంలో విద్యాభివృద్ధి, విద్యార్థుల ఉన్నత చదువులు, మౌలిక వసతుల కల్పనపై మూడోసారి ఆయన మాట్లాడారు. కనిగిరిలో ఏకలవ్య ఎస్టీ గురుకుల పాఠశాల నిర్మాణం దాదాపు 80శాతం పూర్తయినా ఎనిమిదేళ్ల నుంచి అలానే ఉందన్నారు. వెలిగండ్ల, పీసీపల్లి, హనుమంతునిపాడు, సీఎస్‌పురం మండలాల్లోని ఎస్సీ, బీసీ హాస్టళ్ల శాశ్వత భవనాలు లేక, అద్దె భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జ్యోతిరావుపూలె గురుకుల పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ట్రిపుల్ ఐటీ కళాశాల పామూరు ప్రాంతంలో మంజూరు చేశారని గుర్తుచేశారు. అందుకు దాదాపు 240 ఎకరాల భూమని గుర్తించి అప్పగించామని, భవనాల నిర్మాణం జరగకపోవటంతో తాత్కాలికంగా ఒంగోలులో నడుస్తోందని వివరించారు. అందులో దాదపు 6వేల మంది విద్యార్థులు ఉండగా వారిలో 3200 మంది మాత్రమే ఒంగోలులోని తాత్కాలిక భవనాల్లో ఉన్నారని తెలిపారు. 2200మంది ఆర్కేవాలీలో, మరో 1100 మంది నూజివీడు కళాశాలలో చదువుతున్నట్లు చెప్పారు. 2027తో ఈ అద్దె భవనాల్లో కొనసాగించేందుకు ఒప్పందం గడువు ముగుస్తుందని వివరించారు. ఈ విషయంపై విద్యాశాఖమంత్రి లోకేశ్, సీఎం చంద్రబాబు దృష్టి సారించి రూ.200కోట్లు కేటాయించి భవన నిర్మాణానికి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

భూపరీక్ష మొబైల్ ల్యాబ్ వాహనాన్ని అందుబాటులోకి తేవాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



గిద్దలూరుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మేలు చేకూర్చే భూపరీక్ష మొబైల్ ల్యాబ్ వాహనాన్ని ఉపయోగంలోకి తేవాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రిని కోరారు. శుక్రవారం శాసనసభ సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 2016లో కేంద్ర ప్రభుత్వం సాయిల్ హెల్త్‌కార్డు స్కీమ్‌లో భాగంగా రాష్ట్రానికి మొత్తం 6 సంచార భూసార పరీక్ష కేంద్రాలను మంజూరు చేసింది. వాటిలో ఒక ల్యాబ్‌ను గిద్దలూరు నియోజకవర్గానికి కేటాయించారన్నారు. భూసార పరీక్షల ద్వారా మెరుగైన ఫలితాలు అందుతున్నాయని, రైతులు ఈ నివేదిక ఆధారంగా పొలాలకు అవసరమైన ఎరువులను సరిగ్గా వినియోస్తే ఎరువులపై పెట్టే అధిక ఖర్చు, పెట్టుబడి తగ్గుతుందని అన్నారు. ఉత్పత్తి పెరిగి రైతులకు అధిక దిగుబడులతో ఆదాయం లభిస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో భూ పరీక్షలు జరగకపోవడం వల్ల ఈ ల్యాబ్‌లు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. అదే కోవలో గిద్దలూరు నియోజకవర్గంలో మంజూరు చేసిన ల్యాబ్ కూడా ప్రస్తుతం వినియోగంలో లేదన్నారు. దీంతో ఖరీదైన పరికరాలు పాడయ్యే స్థితిలో ఉన్నాయన్నారు. వెంటనే సాయిల్ టెస్టింగ్ ల్యాబోరేటరీ వాహనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. సిబ్బందిని నియమించి అవసరమైన నిధులు కేటాయించి ఉపయోగంలోకి తీసుకుని రావాలని, భూసార పరీక్షలను మళ్లీ ప్రారంభించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

భారీ వర్షాలకు రంగనాయకస్వామి ఆలయం బంద్

రాచర్ల : మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శనివారం నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో దర్శనాలను బంద్ చేసినట్లు ఎస్‌ఐ పీ కోటేశ్వరరావు తెలిపారు. భక్తులు సహకరించాలని కోరారు.

మహిళల ఆరోగ్య భద్రతపై
ప్రభుత్వాల ప్రత్యేక శ్రద్ధ

దర్శి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాయని దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో 'స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్' పథకంలో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ మహిళల కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అద్భుతమైన పథకాన్ని ఆరంభించారని చెప్పారు. మహిళలకు స్కానింగ్‌తో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఆరోగ్య భద్రతతోపాటు ఆర్థిక స్వావలంబనకు ఎన్నో రాయితీ పథకాలు అమలు చేస్తున్న ఘనత ప్రజాప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి బెజవాడ శ్రీవాణి, సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, సంఘసేవకుడు జీవీ రత్నం పాల్గొన్నారు.

29న కనిగిరిలో మీకోసం

కనిగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ఈనెల 29వ తేదీన మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు, రైతులు వారి సమస్యలను నేరుగా అర్జీల రూపంలో తెలియచేయాలని కోరారు. కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ పాల్గొంటారని తెలిపారు. అక్టోబరు 27వ తేదీన, నవంబరు 17వ తేదీన కనిగిరిలో మీకోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

30లోపు కేంద్ర ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తులు

ఒంగోలు విద్య,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఉపకారవేతన పరీక్ష నేషనల్ మాన్సికమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు విద్యార్థులు ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతిసౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులన్నారు. దరఖాస్తు చేసే సమయంలో ఎటువంటి ధ్రువపత్రాలు అవసరం లేదన్నారు. కానీ పరీక్ష రాసే సమయనికి అన్ని ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు పరీక్ష రుసుం రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించాని తెలిపారు. ఈ ఉపకార వేతనానికి ఎంపికైన వారికి ఏడాదికి రూ.12వేల చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు కలిపి మొత్తం రూ.48వేల ఉపకారవేతనం లభిస్తుందని ఆయన తెలిపారు.

1 నుంచి పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అక్టోబరు 1వ తేదీన ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కిమ్స్, అస్టార్ రమేష్, ఉపాస్, శ్రీరామ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రిమ్స్ హాస్పిటల్ వైద్యాధికారులు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొంటారన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి ప్రారంభించే కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బిఎన్ విజయుమార్‌తో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహించినా, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి కే ఆంజనేయులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇంటర్మీడియెట్ విద్యా మండలి ప్రకటించిన క్యాలెండర్ ప్రకారం జూనియర్ కళాశాలలకు ఈనెల 28 నుంచి అక్టోబరు 5 వరకు కళాశాలలు సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు.

ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కొండపి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని ప్రాచీన దేవాలయాల జీర్ణోద్ధరణ, అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కోరారు. ఈమేరకు శుక్రవారం అమరావతిలో ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సీబీజీ ప్లాంట్‌కు భూమి సిద్ధం

● కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కంప్రెస్డ్ బయో గ్యాస్(సీబీజీ) ప్లాంట్ నిర్మాణానికి భూమి సిద్ధంగా ఉందని కలెక్టర్ పీ రాజాబాబు తెలిపారు. ప్రభుత్వచీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సీబీజీ ప్లాంట్‌కు జిల్లాలో 4993 ఎకరాల భూమిని ఎంపిక చేశామన్నరు. మొదటిదశలో భూమిసేకరణ పూర్తయిందని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమి సమస్యలేదన్నారు. నెడ్‌క్యాప్, రిలయన్స్ సంస్థ సంయుక్తంగా జిల్లాలో సోలార్ పార్క్ నిర్మించనుందని తెలిపారు. తసోలార్ పార్క్ నిర్మాణానికి 90వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం నుంచి అధికారికంగా లేఖలు అందాయన్నారు. అందుకోసం ప్రస్తుతం 55వేల ఎకరాల భూమిని గుర్తించామని సీఎస్‌కు ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు వివరించారు. మిగిలిన భూమి పరిశీలనలో ఉందని, మూడు రోజుల్లో ప్లాంట్‌కు సంబంధించిన ప్రత్యేక బృందం జిల్లాకు రానుందని, అందుకు అవసరమైన దస్త్రాలను సిద్ధం చేయాలని సీఎస్ ఈసందర్భంగా కలెక్టర్‌ను ఆదేశించారు. పీఎం కుసుమ్ కింద జిల్లాలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల కోసం 77 ఎకరాల భూమిని కేటాయించామని కలెక్టర్ రాజాబాబు తెలిపారు. మిగిలిన 21 ఎకరాల భూమిని ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తిచేయనున్నట్లు తెలిపారు. అంతకు ముందు సీఎస్ విజయానంద్ కలెక్టర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్‌టీ, సూపర్‌సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. దసరా నుంచి దీపావళి పండుగ వరకు ఈ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు జీఎస్‌టీ ద్వారా కలిగే నష్టాన్ని ప్రభుత్వం భరిస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పీఎం కుసుమ్ కింద జిల్లాలో భూసేకరణ చేపట్టాలన్నారు. అనంతరం సీఎస్ అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణతో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు

వస్తు సేవా పన్నులపై అవగాహన కల్పించాలి

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వస్తు సేవా పన్నులను ప్రభుత్వం తగ్గించడం ద్వారా ప్రజలజీవన ప్రమాణాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. వస్తు సేవల పన్నుల తగ్గింపులపై విస్తృతంగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శుక్రవారం సాయంత్రం మునిసిపల్ కమీషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. సాధారణ కుటుంబంలో నిత్యవసర వస్తువులకు ప్రతినెలా రూ.15వేలు ఖర్చు అవుతుండగా జీఎస్‌టీ తగ్గింపు ద్వారా ప్రస్తుతం మూడు నుంచి నాలుగు వేలు తగ్గుతుందన్నారు. తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, వాణిజ్యశాఖ డీడీ సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

రుణాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ రాజాబాబు సూచించారు. జిల్లాలో ఉపాధి కల్పన యూనిట్లను ప్రోత్స హిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగపడేలా జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం బ్యాంకర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణాల లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎల్‌డీఎం రమేష్; వివిధ శాఖల అధికారులు నారాయణ,శ్రీహరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి

బైకుపై వస్తున్న యువకులను ఢీకొట్టిన ప్రైవేటు విద్యాసంస్థ బస్సు

పొదిలి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామం వద్ద ఒంగోలు - నంద్యాల జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన హనుమంతునిపాడుకు చెందిన మచ్చా వెంకట సుబ్బయ్య, తిరుపతమ్మ కుమారుడు బ్రహ్మయ్య, వెలిగండ్ల మండలం పూలికుంట్ల గ్రామానికి చెందిన బండ్లమూడి రాజా, రమణమ్మ కుమారుడు బండ్లమూడి గురువిష్ణు ఇద్దరూ అక్కాచెల్లెళ్ల పిల్లలు. గురువిష్ణు తల్లిదండ్రులు వివిధ పనుల నిమిత్తం విజయవాడలో స్థిరపడ్డారు. బ్రహ్మయ్య కుటుంబ సభ్యులు హనుమంతునిపాడు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువిష్ణు విజయవాడ ఆర్‌కే కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్, మచ్చా బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. దసరా పండుగకు సెలవులు ఇవ్వడంతో వారిద్దరూ రాత్రి విష్ణు వాళ్ల ఇంట్లో ఉన్నారు. పండుగను బ్రహ్మయ్య వాళ్ల ఇంట్లో జరుపుకునేందుకు బైకుపై విజయవాడ నుంచి హనుమంతునిపాడు బయలుదేరారు. ఈక్రమంలో పొదిలి నగరపంచాయతీ పోతవరం వచ్చే సరికి కంభాలపాడులో విద్యార్థులను ఎక్కించుకొని పొదిలి వస్తున్న ప్రైవేటు సంస్థలకు చెందిన కాలేజీ బస్సు బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బ్రహ్మయ్య (18), గురువిష్ణు (21) మీది నుంచి స్కూల్ బస్సు వెళ్లడంతో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. హెల్మెట్ ఉన్నా ఇద్దరు ముఖాలు ఛిద్రమయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాలను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం బంధువులకు సమాచారమివ్వగా వారు ఆసుపత్రికి వచ్చి బోరున విలపించారు. ఇరు కుటుంబాల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేమన తెలిపారు.



ప్రమాదానికి కారణమైన ప్రవేటు పాఠశాల బస్సు

రెండు ఓట్లుంటే ఒకటి రద్దు చేసుకోవాలి



వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్వో సమావేశం

డీఆర్‌వో చిన ఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండేసి ఓట్లు కలిగి ఉంటే అందులో ఒక ఓటును రద్దు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఒబులేషు కోరారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఓటరు ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలన్నారు. రెండు ఓట్లు కలిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో ఎవ్వరైనా చనిపోయిన వారి ఓట్లు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. అందుకు ముందు పలు రాజకీయ పార్టీల నాయకులు పలు అంశాలపై డీఆర్వో దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.


మహాలక్ష్మీ పాహిమాం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రులను పురస్కరించుకుని మార్కాపురంలో వివిధ ఆలయాలలో అమ్మవార్లు శుక్రవారం వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మిగా, శివాలయంలో జగదాంబ మహాగౌరిగా, వాసవీ కన్యాకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత మహాలక్ష్మి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని కోలభీమునిపాడు గ్రామ సమీపంలోని ముద్దసానమ్మ ఆలయంలో అమ్మవారు గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో రూ.1.26కోట్ల కరెన్సీ నోట్లతో అమ్మవారిని, దేవాలయ ప్రాంగణాన్ని, ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. వేలాది మంది భక్తులు కరెన్సీ నోట్ల అలంకారంలో ఉన్న ధనలక్ష్మీదేవిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు నరసింహ అవతార అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కంభం : శ్రీ కోట సత్యమాంబ దేవి అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కంభంలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారు శ్రీ కాత్యాయని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.


త్రిపురాంతకంలో శైలపుత్రిగా


రాచర్లలో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు


కొమరోలులో కల్పవృక్ష వాహనంలో గోవిందుడు

బేస్తవారపేట : శ్రీవాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో, శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

కొమరోలు : శ్రీ భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు సందర్భంగా శుక్రవారం స్వామివారిని కల్పవృక్షవానంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేవర రమేష్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. విశ్రాంత ఉద్యోగి నారాయణ సహకారంతో ముత్యాల పల్లకిలో స్వామివాని ఊరేగించారు. అలాగే వాసవీ మాత బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.

రాచర్ల : శ్రీ పట్టాభి రామస్వామి ఆలయంలో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

త్రిపురాంతకం : త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఐదవరోజు బాలాత్రిపురసుందరీదేవి శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

గిద్దలూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఎంపీపీ పాల్గొన్నారు. నీటి, కొళాయి, ఖాళీ స్థలాలు, షాపుల పన్నులు, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలలో ఉండే వర్మీ కంపోస్టు అమ్మడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీతారామారావు మాట్లాడుతూ పంచాయతీ నిధులను పెంచుకునే విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బ్లాక్ లెవెల్ రీసోర్స్‌పర్సన్స్ గురునాథరెడ్డి, అంకిరెడ్డి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

పొదిలి : గ్రామాల్లో రెవెన్యూ ఆదాయం పెంచేందకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్, డిజిటల్ అసిస్టెంట్‌లకు రెవెన్యూలో ఆదాయం పెంచే కార్యక్రమంపై జరిగిన రెండు రోజుల శిక్షణలో ఆయన మాట్లాడారు.

రాచర్ల : గ్రామాల్లో సుస్థిర అభివృద్ధికి సిబ్బందికి చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. పంచాయతీల అభివృద్ధి, సుస్థిర పాలన తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అభివృద్ధిపై లక్ష్యాలతో కూడిన ప్రణాళికలు సిద్ధం చేసుకోలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ వీ అనిల్ కుమార్, జి సరస్వతీదేవి, ఎంపీ నాయక్, బీ విష్ణువర్ధనాచారి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

బాల వెంకటయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

కంభం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హత్యకు గురైన టీడీపీ కార్యకర్త వెంకటయ్య మృతదేహానికి టీడీపీ నేత కృష్ణకిశోర్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం కుటుంబానికి రూ.10వేల సాయం అందజేశారు. అర్ధవీడు మండలం గన్నేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాలవెంకటయ్య (45) గురువారం గ్రామంలోని రోడ్డుపై నిలిచి ఉండగా అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని షేక్ ఖాదర్ కర్రతో వెంకటయ్య తలపై బలంగా కొట్టడంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటయ్య మృతదేహానికి కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న కృష్ణకిషోర్ రెడ్డి వైద్యశాలకు వచ్చి వెంకటయ్యకు నివాళులర్పించి కుటుంబానికి రూ.10వేలు సాయం అందించారు. కార్యక్రమంలో అర్ధవీడు, కంభం మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొమ్మరి కులం పేరు మార్పు తగదు

కంభం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దొమ్మరి కులం పేరు మార్పు చేస్తూ బలిజ అని చేర్చడంపై పునరాలోచించాలని మండల శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం వారు తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాపు నాయకులు పగిడి వెంకటరమణ, మల్లికార్జున మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కాల్వ పాండు రంగయ్య, రమణ, నారాయణ, తోట శ్రీనివాసులు, కాసుల పాండు పాల్గొన్నారు.

బేస్తవారపేట : బలిజ కులస్థులకు కేటాయించిన కార్పొరేషన్ నిధులు వారికే చెందాలని కాపు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు.కార్యక్రమంలో పగిడి రమణ, శ్రీనివాసులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఐలమ్మకు రజకుల నివాళి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొంగళవీడు రోడ్డులోని శ్రీ మడియాలేశ్వరస్వామి గుడి ఆవరణలో శుక్రవారం తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. గౌరవాధ్యక్షుడు ఆవులమంద శ్రీనివాసులు, తూర్పునాటి గోపాల్, కొమరోలు శ్రీను, రజక అభివృద్ధి సంఘం అధ్యక్షుడు పాలకవీటి బాలచెన్నయ్య ఐలమ్మ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గుడి అధ్యక్షుడు కాదరయ్య, సెక్రటరీ రామాంజనేయులు, గురువయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల ఆకస్మిక తనిఖీలు

గిద్దలూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ డే సందర్భంగా పలు చోట్ల రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సినిమా హాళ్లను తనిఖీ చేసిన సందర్భంగా వాటర్‌బాటిల్స్, ఇతర తినుబండారాలు అధిక రేట్లకు అమ్ముతున్నట్లు గుర్తించారు. టికెట్లు జారీ చేసే సమయంలో లోపాలు గుర్తించి యాజమాన్యానికి తగిన సూచనలు చేశారు. పెట్రోల్ బంకులో కనీస సౌకర్యాలు లేకపోవడం గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, ఇతర రెవిన్యూ అధికారులతోపాటు వినియోగదారుల సంఘం సభ్యులు వీరారెడ్డి పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంట సాగు చేసిన ప్రతి రైతూ ఈ-క్రాప్‌ను చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని ఇడుపూరు రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్‌తో రాయితీ, పంటకు మద్దతు ధర లభిస్తాయని చెప్పారు. అనంతరం మన గ్రోమోర్ గోడౌన్‌లో తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, ఈపోస్ మిషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో బుజ్జిబాయి, టెక్నికల్ ఏవో ప్రసన్న రంగ లక్ష్మి, వీఏఏ అనిత పాల్గొన్నారు.

జలమయమైన పుచ్చకాయలపల్లి

గొబ్బూరులో ఇళ్లల్లోకి వెళ్లకుండా గ్రామస్థుల చర్యలు

పెద్దారవీడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో కురిసిన అల్పపీడన ప్రభావంతో మండలంలో వర్షం కుంభవృష్టి కురిసింది. మండలంలోని పెద్దారవీడు, బద్వీటి చెర్లోపల్లి గ్రామాలలో గురువారం చిరుజల్లులు కురియగా శుక్రవారం తెల్లవారు జాము నుంచి విస్తారంగా వర్షం కురిసింది. దీంతో కాల్వలలో ప్రవహించిన నీటితో చెరువులు నిండాయి. వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సుంకేసుల డ్యాంను ఆనుకొని ఉన్న పుచ్చకాయలపల్లి గ్రామం జలమయమైంది. గ్రామమంతా వర్షపునీటితో నిండుకుండలా మారింది. దీంతో గ్రామానికి రాకపోయలు నిలిచిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని గొబ్బూరులో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అధికారులు నిర్మించిన మురుగునీటి కాల్వ గుండా వర్షపునీరు వెళ్లేందుకు తగు చర్యలు తీసుకోకపోవడమే సమస్యకు కారణంగా కనిపిస్తుంది. మండలంలో మిగిలిన అన్ని గ్రామాలలో నిరంతర వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో ఇప్పటి వరకూ కురిసిన వర్షంతో సాగుచేసిన పంటలకు మేలు జరుగుతుందని, ఇది కొనసాగితే పంటలకు నష్టమని వ్యవసాయాధికారులు తెలిపారు.


ఐనముక్కుల బీసీ కాలనీలో నిలిచిన నీరు

ఐనముక్కుల బీసీ కాలనీలో వరద

పెద్ద దోర్నాల : మండలంలోని ఐనముక్కుల బీసీ కాలనీలో వాన నీరు నిలిచి జలమయంగా మారింది. దీంతో నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. వీధి అంతా మురికి నీటితో కాలువను తలపిస్తూ ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మండల అధికారులు ఎంపీడీవో నాసర్ రెడ్డి, తహసీల్దారు అశోక్ కుమార్ రెడ్డి, పంచాయతీ ఈవో శివ కోటేశ్వరరావు అక్కడకు వెళ్లి నీటిని తొలగించే ప్రయత్నాలు చేశారు. కాని వీలు పడలేదు. బీసీ కాలనీ నుంచి దిగువకు నీటిని మళ్లించే అవకాశం అక్కడ లభించలేదు. కారణం వర్షపు నీరు ప్రవహించే పల్లపు ప్రాంతం అంతా సంబంధిత యజమానులు మట్టితో మెరకగా మార్చారు. దీంతో ఆ నీరు బయటకు వెళ్లే అవకాశం లేదు. నివాసితుల ఇండ్లలోకి కూడా నీరు చేరుతోంది. తమ పరిస్థితి ఏమిటని వాపోతున్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

కొమరోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో ఎస్ సత్యం అన్నారు. కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వసతులు కల్పించాలని, సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు.

దసరా సెలవుల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

కనిగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల్లో ప్రజలు, పోలీసు సూచనలను పాటించాలని సీఐ ఖాజావలి చెప్పారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రజలు దసరా సెలవులకు బంధువుల ఇళ్లకు గానీ, పుణ్యక్షేత్రాలకు వెళ్లదలచిన వారు తప్పని సరిగా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి ఇళ్లకు పోలీసులు గస్తీ నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా విద్యార్థులు, చిన్నారులు ఈత కొట్టేందుకు వాగుల్లోకి, చెరువుల్లోకి, కుంటల్లోకి వెళ్లకుండా వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

డ్రోన్లతో పెట్టుబడి భారం తగ్గించుకోవచ్చు

పీసీపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : డ్రోన్ల వినియోగంతో రైతులు పెట్టుబడి భారాన్ని తగ్గించుకోవచ్చునని ఆత్మ బీటీఎం సీహెచ్ సురేఖ, మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగాక్రిష్ణలు చెప్పారు. మండలంలోని గుదేవారిపాలెం, పెదఅలవలపాడు గ్రామాల్లో ఆత్మ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కందిపైరులో డ్రోన్ల ద్వారా క్రిమి సంహారక మందులు పిచికారీ, ఎరువులు వేసే విధానాన్ని రైతులకు ప్రదర్శన ఇచ్చారు.

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

పామూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవస్థాన హుండీలు, మోటార్ సైకిళ్ల చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కిశోర్‌బాబు చెప్పారు. స్థానిక జాతీయ రహదారి ప్రాంతంలో వెళుతున్న పలు వాహనాలను సిబ్బందితో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని సీఎస్‌పురం రోడ్‌లో జటిలంగా మారుతున్న ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. రోడ్లపై వాహనాలు, షాపింగ్‌ల బోర్డులను తొలగించారు.

పరిశ్రమ స్థాపనలో మహిళలకు ముందుకురావాలి

తాళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపనలో మహిళలు ముందుకురావాలని డీఐసీ డైరెక్టర్ ధనసరస్వతి చెప్పారు.స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డీఐసీ డైరెక్టర్ ధనసరస్వతి మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంలో భాగంగా ప్రతి మహిళ చిన్న తరగతి పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికంగా ఎదగాలన్నారు.ఏపీఎం దేవరాజ్, సీసీ మోహన్‌రావు పాల్గొన్నారు.

భీమవరం పంచాయతీ కార్యదర్శిగా నాగార్జున

ముండ్లమూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం పంచాయతీ కార్యదర్శిగా నాగార్జున నియమితులయ్యారు. ఈయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కురిచేడు మండలం నమఃశివాయపురం అగ్రహారం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై భీమవరానికి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ రహీంను కలసి జాయింట్ రిపోర్టు అందజేశారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలి

తాళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నల్లబర్లీ పొగాకు సాగును నిషేధించినందున రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు చెప్పారు. తాళ్లూరు వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద పొగాకు వద్దు-ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి అంటూ శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రజానగరం సర్పంచ్ కాలేషావలి, మాజీ సర్పంచ్ దాసు, మన్నం రామకోటయ్య పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

పామూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలు సొంత ఆదాయ వనరులపై దృష్టి సారించి ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు మండలస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సకాలంలో పన్నులు వసూలు చేసి, ఆదాయ మార్గాల వనరులపై చెస్ విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాదాల రమేష్, శిక్షకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి

పీసీపల్లి, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని ఎంపీడీవో క్రిష్టారావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల పరిపాలనాధికారి ప్రభాకరశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజిత

తాళ్లూరులో...

తాళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆదాయవనరులు పెంచేదిశగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీవో అజిత చెప్పారు. స్థానిక మండల పరిషత్ సమావేశంహాలులో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లకు ఆర్‌జీఎస్‌ఏ యాక్షన్ ప్లాన్ 2025-26పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల అభివృద్ధికి మార్గాలను రూపొందించాలని మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో షేక్ అబ్దుల్ రహీం చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో ఆర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయం

వైద్యాధికారి బీ మధు శంకర్

ముండ్లమూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యవంతంగా జీవించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బీ మధు శంకర్ చెప్పారు. ఆయన శుక్రవారం మండలంలోని శంకరాపురంలో స్వస్థ్ నారి సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కూరపాటి మహేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, నారాయణ స్వామి, రిటైర్డు ఎస్ఐ ఆంజనేయులు, హెచ్ఎం అరుణ కుమారి, సీహెచ్‌వో పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రవళి ప్రియాంక

బొద్దికూరపాడులో...

తాళ్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్‌రెడ్డిఆధ్వర్యంలో బొద్దికూరపాడు గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మందా శ్యాంసన్, ఎంపీటీసీ సభ్యుడు బాలకోటయ్య, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, పోలంరెడ్డి రమణారెడ్డి, హెచ్ఎసవో చంద్రశేఖర్, పీహెచ్ఎన్ రమణమ్మ, హెచ్‌సీ సుశీల పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో మహిళా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే అందరికీ సురక్షితమని టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు చెప్పారు. ఎర్రచేలు, ప్రభుత్వ పాఠశాలలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ సుబ్బయ్య, టీడీపీ నాయకులు జయరామిరెడ్డి, నాగేశ్వ, సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి పాల్గొన్నారు.

కనిగిరి మున్సిపాలిటి డీ లిమిటేషన్‌కు వార్డు సర్వే చేపట్టాలి

కనిగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి మున్సిపాలిటీ డీ లిమిటేషన్‌కు సచివాలయ సర్వే నిర్వహించాలని టీపీవో సువర్ణకుమార్ చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం సచివాలయ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో మున్సిపల్ మేనేజర్ ప్రసాద్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కనిగిరి మున్సిపాల్టీ పరిధిలోని ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 28 వార్డులుగా విభజించి వార్డు బౌండరీలను ఏర్పాటు చేసి అక్టోబరు 14వ తేదీలోపు ప్రక్రియ పూర్తి చేసి నివేదిక అందచేయాలని ఆదేశించారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



దర్శి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కనకదుర్గమ్మ, పోలేరమ్మ, దద్దాలమ్మ, వెంకటేశ్వరస్వామి దేవాలయాల్లో అమ్మవారు శుక్రవారం మహలక్ష్మీదేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు. పోలేరమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. రూ.40 లక్షల నగదుతో అమ్మవారిని అలంకరించారు.

దొనకొండలో...

దొనకొండ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రుల వేడుకల్లో శ్రీ ఈశ్వరీదేవి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు మణిబాబుశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మారెళ్లలో రూ.7.50 లక్షల కరెన్సీతో అలంకరణ

ముండ్లమూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన శుక్రవారం భ్రమరాంబ దేవి, పార్వతిదేవి అమ్మవార్లను మహాలక్ష్మి అవతారంలో అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. మారెళ్లలో శ్రీ చెన్నమల్లేశ్వరి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు రూ.7.50 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

అష్టలక్ష్మిగా జ్ఞాన ప్రసూనాంబ

కురిచేడు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కురిచేడు జ్ఞాన ప్రసూనాంబ సమేత కాళహస్తీశ్వర ఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు అష్టలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కురిచేడు సుబ్బారావు పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎరువులు అధిక రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎరువుల షాపుల డీలర్లు ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కే కమలాకర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం సాయంత్రం ముండ్లమూరులోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలో ఉన్న స్టాక్, అమ్మకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పీవీ హనుమంతరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీల బహూకరణ

పీసీపల్లి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదఅలవలపాడు అంగన్వాడీకేంద్రానికి 10 కుర్చీలను జనసేన ఆంధ్ర సెంట్రల్ కమిటీ సభ్యులు మాదాసు రమేష్‌బాబు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పువ్వాడి నాగరాజు, జనసేన పార్టీ నాయకులు శానం రామాంజనేయులు పాల్గొన్నారు.





నిడుబ్రోలు - అప్పికట్ల రైల్వే సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన డైవర్షన్ మార్గంలో ప్రయాణిస్తున్న రైలు

సూపర్ ఫాస్ట్‌గా రైళ్లు

- 140 కిలోమీటర్ల వేగంతో రాకపోకలు
- నిరోధకాలకు చెక్‌తో వేగవంతంగా ప్రయాణం
- నిడుబ్రోలు-అప్పికట్ల మార్గంలో టెస్టురన్ విజయవంతం

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇక రైళ్లు సూపర్‌ఫాస్ట్‌గా రాకపోకలు సాగించనున్నాయి. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో వేగ నిరోధకాలతో అటు విజయవాడ, ఇటు గుంటూరు డివిజన్ల నుంచి వచ్చే పలు రైళ్ల సమయపాలన అదుపుతప్పుతూ వస్తోంది. ఇక్కడ 10 కిలోమీటర్ల పొడవునా నేల స్వభా వం సరిగా లేకపోవడంతో తరచుగా రైళ్ల పట్టాలు తప్పడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైళ్లను దాదాపుగా 32 కిలోమీటర్ల పొడవునా 75 నుంచి 90 కిలోమీటర్ల వేగానికి మించి నడపకుండా చూస్తున్నారు. దీని వల్ల ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు, వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లు కూడా ఈ సెక్షన్‌లో నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. సమయపాలన నష్టపోవాల్సి వస్తున్నది. హౌరా - చెన్నై రైలుమార్గంలో దశాబ్దాల తరబడి రైళ్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో శాశ్వత డైవర్షన్ పనులు పూర్తి అయ్యాయి. పదేళ్ల క్రితమే ఇక్కడి వాగుపై కొత్త వంతెన నిర్మించినప్పటికీ రైలుమార్గం డైవర్షన్ చేపట్టలేదు. ఎట్టకేలకు మూడు స్ట్రెచ్‌లలో ఆరు కట్ అండ్ కనెక్షన్లు చేశారు. పూర్తి అయిన శాశ్వత డైవర్షన్ సెక్షన్‌లో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్టురన్ నిర్వహించింది. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేసింది. దీంతో కొద్ది రోజుల్లోనే ఈసెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండానే రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వేగం పెరిగి నిర్దిత సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుంటాయని రైల్వే అధికారులు తెలిపారు. అలానే ఇతర డివిజన్లు, జోన్ల నుంచి రైళ్లను ఆలస్యంగా అందిస్తున్నారన్న ఫిర్యాదులకు కూడా ఫుల్‌స్టాప్ పడుతుంది.

ఎంత ప్రవాహం వచ్చినా తట్టుకునేలా..

నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో నేల స్వభావం పటిష్ఠంగా లేని కారణంగా రైలు మార్గం కోసం నిర్మించిన బండ్ ఒరిగిపోతున్నది. అంతేకాకుండా పాతవంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2014-19 మధ్య అప్పటి జలవనరుల శాఖ నూతన బ్రిడ్జిని నిర్మించింది. వాగులో ఎంత వరద ప్రవాహం వచ్చినా తట్టుకునేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలోనూ ఇబ్బంది లేకుండా డైవర్షన్ పనులను పూర్తి చేశారు.

కీలకమైన మార్గం..

ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కోస్తా తీరం పొడవునా హౌరా-చెన్నై రైలుమార్గాన్ని నిర్మించారు. దేశంలోని వివిధ రైలు మార్గాల్లో ఇదొక కీలకమైనది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే రైళ్లు కూడా విజయవాడ నుంచి హౌరా-చెన్నై రైలుమార్గంలో ప్రయాణించాల్సిందే. ఈ కారణంగా నిత్యం వందలాది సంఖ్యలో పాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లతో పాటు సరుకు రవాణాకు కూడా ఇదొక ముఖ్యమైన సెక్షన్. దీంతో గూడ్స్ రైళ్లు కూడా ప్రయాణిస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ రైలుమార్గంలో నిడు బ్రోలు - అప్పికట్ల సెక్షన్ దశాబ్దాల తరబడి ఇబ్బందికరంగా పరిణమించింది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

గంజాయి రహితంగా మార్చాలి

- బాపట్లలో రిహాబిటేషన్ సెంటర్ ఏర్పాటు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగల్ టీమ్‌లను ఏర్పాటు చేసి మాదకద్రవ్య వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాపట్లలో రిహాబిటేషన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిత్యం చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలని, తాగునీటిని వేడిచేసి తాగాలని సూచించారు.

- అభివృద్ధికి సంబంధించి అన్ని విభాగాలలో జిల్లా మొదటి మూడుస్థానాల్లో ఉండాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. డీఆర్వో, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్‌తో కలిసి గ్రామశ్రేయస్సు, స్థితిస్థాపక ప్రణాళిక తయారీ, జీడీపీ ప్రణాళికల తయారీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.
- ఎస్సీలు, దివ్యాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్సీలు, దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివ్యాంగులవద్దకే వెళ్లి అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అన్నపూర్ణాదేవిగా శ్రీబగళాముఖి



పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానం శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఐదో రోజు వైభవోపేతంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీబగళాముఖి అమ్మవారు భక్తులకు శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. చండీహోమాలు, కుంకుమార్చనలకు భక్తులు హాజరయ్యారని త్రిముఖ దేవాలయాలకు చెందిన కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.

పొంచి ఉన్న వరద ముప్పు

- 9 లక్షలు క్యూసెక్కులు వచ్చే అవకాశం
- తీరప్రాంతవాసులను అప్రమత్తం చేసిన అధికారులు
- నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక

రేపల్లె, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం.. భారీ వర్షాలు.. ఎగువ నుంచి వరదతో కృష్ణానదీ తీర గ్రామాలకు ముంపు పొంచి ఉంది. భారీవర్షం పడితే నదికి 8 నుంచి 9లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చే పరిస్థితి ఉందని అధికారులు భావిస్తున్నారు. వరద పోటెత్తే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతంలో 8 లక్షల క్యూసెక్కులతోనే కరకట్ట అంచుదాకా నీరు ప్రవహించింది. ప్రస్తుతం అదే స్థాయిలో వరద సంభవిస్తే కొంతమేర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాలపై వరద ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్స్ ఏర్పాటు చేశారు.

భయపెడుతున్న కోతలు..

ప్రస్తుతం కరకట్టకు పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, కనగాలవారిపాలెం సమీపంలో పైప్‌లైన్లు వేయడంతో ప్రమాద భరితంగా మారింది. భారీ స్థాయిలో కోసుకుపోవడంతో కరకట్ట దిగువనున్న మైనేనివారిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, గంగడిపాలెం, లక్ష్మీపురం, అడవిపాలెం గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



హార్బర్‌లో 3వ నెంబర్ ప్రమాద సూచక



హార్బర్‌లో ఒడ్డుకు చేరిన బోట్లు

సముద్రంలో అలల ఉధృతి..

సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈదురుగాలులతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. వాతావరణశాఖ ఆదేశాలతో శుక్రవారం నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. సముద్రంలో వేట చేసే మత్స్యకారులంతా తక్షణం ఒడ్డుకు చేరాలని వాకీటాకీల ద్వారా సమాచారం అందించారు. మత్స్యకారులు హార్బర్‌కు చేరుకున్నారు.

ఏఎంఆర్ చెక్‌పోస్టులు ధ్వంసం

- ప్రైవేటుకు సీనరేజ్ వసూళ్ల బాధ్యతపై ఆగ్రహం

బల్లికురవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మైనింగ్ సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీకి అప్పగించింది. ఇందుకు సంబంధించి ఆ కంపెనీ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో మండలంలోని గ్రానైట్ రవాణా జరిగే పలు ప్రదేశాల్లో సంబంధిత కంపెనీ ఇనుప కంటైనర్ బాక్సులను ఏర్పాటు చేసింది. చెక్ పోస్టుల ఏర్పాటుపై గ్రానైట్ పరిశ్రమ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే పరిశ్రమల నిర్వహణ భారంగా మారిన పరిస్థితుల్లో చెక్‌పోస్టులతో మరిన్ని ఇబ్బందులు వస్తాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు గురువారం రాత్రి కొణిదెన, వేమవరం, మల్లాయపాలెం క్వారీల సమీపంలో ఏర్పాటు చేసిన కంటైనర్ బాక్సుల అద్దాలను ధ్వంసం చేశారు. చెక్ పోస్టులు ఏర్పాటైతే గ్రామాల్లో ఘర్షణలు కూడా జరిగే ప్రమాదం ఉందని గ్రామస్థులు తెలిపారు. గతంలో నాశిరకంగా ఉన్న రాళ్లు బిల్లులు లేకుండానే జరిగేవి.. ఇప్పుడు చెక్‌పోస్టులతో బిల్లు తప్పనిసరి. దీంతోనే గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకుల్లో ఆందోళన నెలకొంది.



మల్లాయపాలెం సమీపంలో క్వారీలకు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన కంటైనర్ అద్దాలు ధ్వంసం చేసిన దృశ్యం

అవీ..ఇవీ..

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

బల్లికురవ, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన మసాని వెంకటమల్లికార్జునరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు బల్లికురవ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో నమోదయ్యారు. ఈ పథకం ద్వారా మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు మంజురయింది. శుక్రవారం బ్యాంకు చీఫ్ మేనేజర్ శీనానాయక్ మృతుడు నామిని అయిన మసాని రామసుబ్బయ్యకు చెక్కును అందజేశారు.కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు బిందు మాధవి, సుహిత గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం

● ఉపాధ్యాయ నియామక పత్రాన్ని అందుకున్న అనూష


నియామక పత్రంతో అనూష


బల్లికురవ, సెప్టెంబరు26 (ఆంధ్ర జ్యోతి): కూలి నాలి చేసుకుని జీవనం సాగించే నిరుపేద ఎస్సీ కుటుంబంలో డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టు రావడంతో అ కుటుంబ ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. మండలంలోని కొప్పెరపాడు ఎస్సీ కాలనీకి చెందిన దమ్ము గంగయ్య గ్రామంలో టైర్లు పంక్చర్ వేసుకుని జీవనం సాగిస్తు న్నాడు. ఆయన భార్య శ్రీరంజని రోజు వారి కూలి పనులకు వెళుతోంది. వీరి పెద్ద కుమార్తె అయిన అనూష చిన్న తనం నుంచి చదువులో చురుగ్గా ఉండేది. అనూష టీటీసీ ఉర్దూ పూర్తి చేసింది. కృష్ణా జిల్లా కోటా కింద ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచి పోస్టును సొంతం చేసుకన్నారు. తన తల్లిదండ్రులు తనపై పెట్టుకొన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి ఉపాధ్యాయ పోస్టు సాధించిన అనూషను పలువురు అభినందించారు. ప్రభుత్వం గురువారం ఉపాధ్యాయ నియమాక పత్రాలను అందజేయగా అనూష మరో మారు తన తల్లిదండ్రుల చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామాక పత్రాన్ని అందుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

● పలుచోట్ల నగదుతో విశేషంగా అలంకరణ ● అద్దంకిలో వాసవీమాతకు కుంకుమ పూజలు

మేదరమెట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు దేవాలయాలల్లో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మేదరమెట్లలోని మిద్దెలడొంకలో దుర్గమాత ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పెద్దసంఖ్యలో నోట్లదండలతో అలంకరించారు. దైవాలరావూరులోని ఉమామహేశ్వరాలయంలో ఉమామహేశ్వర అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావినూతల పమిడిపాడు, కొరిశపాడు, ప్రాసంగులపాడు గ్రామాల్లోని ఆలయాల్లో శరన్నవ రాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అద్దంకి : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దత్తపాదుకా క్షేత్రం, వేయి స్థంభాల గుడిలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.




అద్దంకి, మార్టూరు, ముప్పవరంలో అమ్మవారి అలంకరణలు

పంగులూరు : మండలంలో శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాలలో శ్రీమహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముప్పవరంలోని శ్రీలక్ష్మీగణపతి షిరిడిసాయి ఆలయంలో గణపతి పూజ, నవావర్ణపూజ, కలశ స్థాపన చేసి స్వామివారికి అభి షేకాలు హోమాలు నిర్వహిం చారు. సాయంత్రం శ్రీచక్రార్చనలు, శ్రీమహాలక్ష్మీపూజ, శ్రీలక్ష్మీ సహస్రనామ కుంకుమార్చన పూజాకార్యక్రమాలు ఆలయ అర్చక స్వామి దివ్యరూపాచారి శాస్త్రోక్తంగా నిర్వహించారు. రేణంగివరంలోని త్రిశక్తిపీఠంలో అమ్మ వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కొండమూరు లోని కొండమూరమ్మ అమ్మవారి ఆలయప్రాంగణంతో పాటు పంగులూరులోని రాయిణివారి వంశదేవర రేణుకమ్మ అమ్మవారి ఆలయం, రామకూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించారు. చందలూరు, పంగులూరు పరిసర గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మార్టూరు : మహాలక్ష్మీదేవి అవతారంలో శుక్రవారం మండలంలోని అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రులు ఉత్సవాలలో భాగంగా ఐదవరోజు శుక్రవారం అమ్మవారిని లక్ష్మీదేవి అలంకరణ చేసి భక్తులు పూజలు చేశారు. మార్టూరులో దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో అర్చకులు సురేష్ అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా రుక్మాబాయి శ్రీపాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మహాలక్ష్మీదేవి అవతారంలో, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీలలితా త్రిపురసుందరీదేవి అవతారంలో అర్చకులు ప్రత్యేక అలంకరించారు. భక్తులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నాగరాజుపల్లి గ్రామంలో శ్రీగంగా పార్వతీ సమేత నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారిని రూ.2 లక్షల నగదుతో అలంకరించారు. ద్రోణాదులలో మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. .

చినగంజాం : స్థానిక భూ సమేత భావనారాయణస్వామి వారి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. చినగంజాం గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని గరుడోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు స్వామివారికి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భావనారాయణస్వామి కోలాటబృందం సభ్యులు వేసిన కోలాటం భక్తులను ఆకట్టుకొంది.



త్రిశక్తి పీఠం, నాగరాజుపల్లెలో మహాలక్ష్మి అలంకరణ

భారీ వర్షాలకు దెబ్బతిన్న నేల చప్టా, రోడ్డు

కొణిదెన- గంగపాలెం గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు

బల్లికురవ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొణిదెన- గంగపాలెం మధ్య రహదారి, వంతెన పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇటీవల భారీ వర్షాలు కురవటంతో పెద్దఎత్తున వర్షపు నీరు రోడ్డుపై నిలిచింది.


గోతులమయంగా ఉన్న రహదారి

దీంతో రాకపోకలు స్తంభించాయి. మండలం లోని కొణిదెన ఉప్పుమాగులూరు పంచాయతీ రాజ్ బీటీ రోడ్డులో గంగపాలెం సమీపంలో ఉన్న నేల చప్టా పూర్తి స్థాయిలో ధ్వంసమైంది. ఈ చప్టాలో ఉన్న గోతులలో నీరు నిలబడడంతో శుక్రవారం రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పెద్ద వాహనాలు ఈ రోడ్డులో వచ్చే వీలులేక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం గ్రానైట్ ముడిరాయి లారీలు తిరిగే రోడ్డులో రాకపోకలు లేక పోవడంతో పరిశ్రమలకు రాళ్ల రవాణా నిలిచి పోయింది. ద్విచక్ర వాహనాల వారు మాత్రం చప్టా అంచులో ఉన్న కొద్ది పాటి రోడ్డులో భయం భయంతో ప్రయాణం సాగిస్తున్నా రు.


భారీ వర్షాలకు నేలచప్టాపై నిలిచిన నీరు

ఈ రోడ్డు అధ్వాన స్థితికి చేరిం దని కొణిదెన గ్రామం నుండి ఉప్పు మాగులూరు వరకు రోడ్డులో మోకాటి లోతు గోతులు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ రోడ్డుకు నిధులు మంజురు చేసి నేల చప్టా ఎత్తుపెంచి రోడ్డును అభివృద్ధి పరచాలని కోరుతున్నారు.

మత్తుపదార్థాల నియంత్రణకు కృషి

బీజేపీ, ఇండియన్ రెడ్‌క్రాస్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

చీరాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలు కోల్పోతున్నారని బీజేపీ, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. శుక్రవారం పట్టణంలో 'సేవా పక్వాడా నషా ముక్త్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ గ్రౌండ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో

● వ్యక్తి మృతి.. మరొకరికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ట్రాలీ వాహనం

మార్టూరు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సును ట్రాలీ ఆటో ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన జాతీయ రహదారిపై మార్టూరు లోని హీరోషోరూం సమీపంలో శుక్రవారం వేకువజామున చోటు చేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్ఐ బాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి కనిగిరి వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి టెంట్ సామన్లతో వస్తున్న ట్రాలీ వాహనం క్రాస్ చేస్తోంది. ఈ క్రమంలో ట్రాలీ ఆటోవాహనం బస్సు వెనుక భాగాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటోలో క్యాబిన్‌పై కూర్చున్న రాయపాటి ప్రకాష్ (37) అనే వ్యక్తి తలకు తీవ్రగాయమైంది. దీంతో ఈ ఘటన స్థలంలోనే మృతిచెందారు. ఆయన పక్కనే కూర్చున్న మరో వ్యక్తి రంపతోటి అశోక్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆయన్ను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవరు వలి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారు టెంట్ సామానుతో తెనాలి, దుగ్గిరాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో మృతిచెందిన ప్రకాష్ అనే వ్యక్తి స్వగ్రామం త్రోవగుంట. ఆయనకు భార్య ప్రియాంక, ఇద్దరు కుమారులున్నారు. మృతుని భార్య ప్రియాంక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించారు.

ద్రోణాదుల సర్పంచ్ భాగ్యరావు అరెస్టు

• సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడంపై చర్యలు

మార్టూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల సర్పంచ్ భాగ్యరావును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఎం నారాచంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై సోషల్‌మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడంతో చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు సీఐ శేషగిరిరావు వివరాలను వెల్లడించారు. సర్పంచ్ భాగ్యారావు అసభ్య పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి, వాటిని కొన్ని వాట్సాప్ గ్రూపులకు పంపించారు. దీంతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, గద్దె అశోక్ మార్టూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ద్రోణాదుల గ్రామంలోని కమ్యూనిటీ భవనం వద్ద భాగ్యారావును సీఐ ఎం.శేషగిరిరావు అదుపులోకి తీసుకొన్నారు. .అనంతరం విచారణ నిమిత్తం భాగ్యరావును బాపట్లలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మామహేశ్వర్ ముందు ప్రవేశ పెట్టారు.

ఆదాయ మార్గాల పెంపుపై అవగాహన

ఇంకొల్లు, సెప్టెంబరు 26,(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఓన్ సోర్స్ రెవెన్యూపై పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంజనీరింగ్ అసిస్టెంట్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఘట్టా శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయితీలు వివిధ పన్నుల ద్వారా రెవెన్యూ సోర్స్ పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవోటీలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం

కొత్తపేట(చీరాల), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిరుధాన్యాల వినియోగంతో చక్కని ఆరోగ్యం లభిస్తుందని వేటపాలెం మెడికల్ అధికారి డా.స్వాతికిరణ్ చెప్పారు. శుక్రవారం కొత్తపేట సచివాలయం-1లో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో ఊబకాయం, చక్కెర వ్యాధులపై అవగాహన కల్పించారు. బాల్యరక్షణపై ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి, ఐటీసీ ఫినిష్ సొసైటీ ప్రతినిధి మంజూష, ప్రశాంతి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్, ఏఎన్‌ఆర్‌లకు భారతరత్న ప్రకటించాలి

చినగంజాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలుగు తేజాలకు ఎన్టీఆర్, ఏఎన్నార్, ఘంటసాలలకు భారతరత్న అవార్డు ప్రకటించాలని నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కార్యక్రమ రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కడవకుదురు గ్రామంలోని ప్రజాచైతన్య కళావేదిక కార్యాలయంలో నవ్యాంధ్ర రాష్ట్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కళాయాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రజా చైతన్య కళావేదిక అధ్యక్షులు ఆరిగ వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నవ్యాంధ్ర సాంస్కృతిక కళాయాత్రగోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాచైతన్య కళావేదిక సభ్యులు పల్లపోలు నాగ మనోహరలోహియా, సుంకర కోటేశ్వరరావు, ముసలారెడ్డి, దైవాల తిరుపతిరెడ్డి, మెలిక గోపాల్, ఏడుకొండలు, శ్రీనివాసరావు, వర్ధమాన సినీనటులు బి.కళిదాసులు పాల్గొన్నారు.

నేడు చినగంజాంలో రెవెన్యూ గ్రామసభ

చినగంజాం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో చినగంజాం రెవెన్యూ పరిధిలో జరగనున్న మూడో విడత భూముల రీసర్వేపై శనివారం ఉదయం 10గంటలకు గ్రామసభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం రెవెన్యూ గ్రామ పరిధిలో ఉన్న సోపిరాల, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, పల్లెపాలెం గ్రామాల్లోని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లోని భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు, భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు, చినగంజాం రెవెన్యూ గ్రామ రైతులందరూ తప్పక హాజరు కావాలని తహసీల్దార్ తెలిపారు.

వృత్తి శిక్షణతో ఉపాధికి అవకాశం : హెచ్ఎం

● విద్యార్థులకు స్వయం ఉపాధిపై ఇంటర్న్‌షిప్

పంగులూరు,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులలో వృత్తిశిక్షణ నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా స్వయం ఉపాధి అకాశాలు మెరుగుపడతాయని హెచ్‌ఎం అనిత అన్నారు. మండలంలోని కొండమంజులూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు ఏపీ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పంగులూరులో నిర్వహిస్తున్న ఒకేషనల్ ఇన్‌టర్న్‌షిప్ కార్యక్రమాన్ని శుక్రవారం హెచ్‌ఎం అనిత పర్యవేక్షించారు. పాఠశాల విద్యార్థులకు ఆటోమోటివ్‌ట్రేడ్‌కు సంబంధించి జి.రవీంద్ర, రిటైల్‌ట్రేడ్‌కు సంబంధించి సీహెచ్ గంగాభవానీప్రసాద్‌లు శిక్షణయిస్తున్నారు. ఆటోమోటివ్‌ట్రేడ్‌లో భాగంగా పంగులూరులోని ఎస్‌ఏఆర్ ఆటోమొబైల్స్‌లో ద్విచక్రవాహనాల పరికరాలు, రిపేర్ల గురించి అవగాహన కల్పించారు. రిటైల్‌ట్రేడ్‌కు సంబంధించి జీఎస్‌ఆర్, నాగమ్మ. జనరల్‌స్టోర్స్, రాజారావు టెక్స్‌టైల్స్‌నందు ప్రోడక్ట్ లేబులింగ్, వ్యాపారవిధానం, వినియోగదారులతో మెలిగేపద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఇన్‌టర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలు మెరుగుపడతాయని, వృత్తిసంబంధమైన వ్యాపారాలలో పదవ తరగతిలో పరీక్షలు రాయడంద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందుతారని హెచ్‌ఎం అన్నారు.

కుందేరు అభివృద్ధికి సహకరించండి

● అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కొండయ్య

● కుందేరు అభివృద్ధితో ఎంఎస్‌ఎంఈ పార్కు, నివేశన స్థలాల కల్పన

చీరాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల కుందేరు అబివృద్ధిపై ఎమ్మెల్యే కొండయ్య శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. ప్రస్తుతం ఆక్రమణలు, జంతు కళేబరాలతో నిండి అస్థవ్యస్థంగా ఉందని అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు. విపత్కర సమయాల్లో చీరాల, పర్చూరు నియోజక వర్గాల్లో పంట పొలాలకు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కుందేరు పరివాహక ప్రాంతాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాలక్రమేణ మురుగు, వ్యర్థనిల్వలతో, గుర్రపు డెక్కలతో వాగు పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. అయితే అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు రూ.89 కోట్లుతో డీపీఆర్‌లు సిద్ధం చేయగా, అర్థాంతరంగా నిలిచిందని, అభివృద్ధి చేస్తే ఎంఎస్ఎంఈ పార్కుతో పాటు, నిరుపేదలకు నివేశన స్థలాలకు కూడా డోకా ఉండదని సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు.

వార్డుల విభజనపై కసరత్తు

● 20 నుంచి 27 వరకు పెరిగిన వార్డులు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవీంద్ర

అద్దంకి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అద్దంకి మున్సిపాలిటీలో వచ్చే కౌన్సిల్‌లో 27 మంది కౌన్సిలర్లు ఉండనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 20 వార్డులను 27 వార్డులుగా విభజించాల్సి ఉంది. ఈ నెల 29వ తేదీ లోపు వార్డుల విభజన పూర్తి చేయాల్సిన నేపథ్యంలో శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీఎల్‌వోలతో కమిషనర్ రవీంద్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల విభజన సమయంలో శాస్త్రీయంగా విభజన జరిగేలా చూడాలన్నారు. కుటుంబసభ్యులు అందరూ ఒకే వార్డులో ఉండడంతో పాటు వార్డులు విభజించే సమయంలో వీధులను హద్దుగా తీసుకోవాలన్నారు. అదే సమయంలో ఆయా వార్డులలో ఓటర్ల సంఖ్యలో కూడా ఎక్కువ వ్యత్యాసం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

మార్టూరు,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలపై సిబ్బందికి ఏవో లావణ్య అవగాహన కలిగించారు. శుక్రవారం మండలంలోని రైతుసేవా కేంద్రం సిబ్బందికి స్థానికంగా ఏవో కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి వరిపంట గ్రామానికి యూనిట్‌గా, జిల్లా యూనిట్‌గా కంది, మినుము పంటలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రసాద్, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

'సోమశిల'లో 72.5 టీఎంసీల నీరు



అనంతసాగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శుక్రవారం 16,190 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 72.559 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 250, కండలేరుకు వరద కాలువ ద్వారా 10,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఆశీర్వచన చేతులతో

దేవుళ్లుగా భావించే స్థాయి నుంచి రౌడీలుగా చూసే స్థాయికి..

అరాచకాలా!?

ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 13 మంది హిజ్రాలు నగర శివార్లలోని దాబా హోటల్ వద్దకు వెళ్లారు. దసరా మాముళ్లు ఇవ్వాలని అక్కడున్న మేనేజర్ హేమంత్‌ను డిమాండ్ చేశారు. తమ యజమాని లేడని చెప్పడంతో హిజ్రాలు దౌర్జన్యానికి దిగారు. వెంటనే యజమానికి ఫోన్‌చేసి పిలవాలంటూ వారు దాబాలో హంగామా సృష్టించారు. దీంతో భోజనం చేస్తున్న కస్టమర్లు వారి వెకిలి చేష్టలకు భయపడి వెళ్లిపోయారు. అడ్డుకున్న దాబా హోటల్ సిబ్బంది పైనా దౌర్జన్యం, దాడి చేసి జారుకున్నారు. ఈ ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి హిజ్రాలను అరెస్ట్ చేశారు.

ఈ నెల 23వ తేదీ రాత్రి కందుకూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు హిజ్రాలు వెళ్లి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్కడ విధుల్లో ఉన్న ఓ నర్సు డాక్టరు లేరని, గొడవ చేయద్దని చెప్పడంతో నర్సుపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ దాడి కేసులో ఐదుగురు హిజ్రాలను కందుకూరు పోలీసులు అరెస్ట్ చేశారు.

వెలుగులోకి వచ్చినవి ఈ రెండు సంఘటనలే. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. సమాజంలో హిజ్రాలను చాలా పవిత్రంగా చూస్తారు. కానీ, ఆ ముసుగులో కొంతమంది చేస్తున్న దౌర్జన్యాలతో ప్రజలు, వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. వారు అడిగినంత ఇస్తే సరే.. లేదా దాడులు చేస్తున్నారంటూ వాపోతున్నారు.



కందుకూరులోని ఓ ఆసుపత్రిలో నర్సుపై హిజ్రాలు దాడి చేస్తున్నట్లు సీసీపుటేజీలో నమోదైన దృశ్యం (ఫైల్)

- జిల్లాలో పేట్రేగిపోతున్న హిజ్రాల దాడులు
- వారి ముసుగులో మరికొందరి దౌర్జన్యం
- వరుసగా వెలుగులోకి వస్తున్న ఘటనలు

జిల్లాలో హిజ్రాల బెదిరింపులు, దౌర్జన్యాలకు అడ్డూఆపు లేకుండా పోతోంది. మనకెందుకులే అనుకొని హిజ్రాలు ఇబ్బందులు పెడుతున్నా చేసేది లేక ప్రజలు తలదించుకొని వారు అడిగినంత ఇచ్చి వెళ్లిపోతున్నారు. కొందరు హిజ్రాల ముసుగులో చీరలు కట్టుకొని దందాలకు పాల్పడుతూ నగదు దోచుకుంటున్నారు. ప్రధానంగా ప్రధాన రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు ఉన్న చోట హిజ్రాలు షిఫ్టుల పద్ధతిలో కాపుకాసి వాహనదారుల నుంచి ముక్కుపిండి నగదు వసూలు చేస్తున్నారు. ఇక నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండు నుంచి అయ్యప్ప గుడి వరకు, మినీ బైపాస్‌లో బీవీనగర్ వరకు హిజ్రాలు రోడ్డుపై కనిపించే ప్రతి ఒక్కరినీ నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నగదు ఇవ్వని వారితో గొడవపెట్టుకుంటున్నారు.

వారంటే ఎంతో భక్తి

'హిజ్రాలు ఆశీర్వదిస్తే మంచి కలుగుతుంది. వారు దిష్టి తీస్తే సైతాన్‌లు కూడా పరుగులు తీస్తాయి. గుమ్మడికాయ, టెంకాయి కొడితే దిష్టిపోయి వ్యాపారం బాగా వృద్ధి అవుతుంది.' అని నమ్మే ప్రజలు కోకొల్లలుగా ఉన్నారు. ఈ క్రమంలోనే అమావాస్య రోజున ప్రధానంగా వ్యాపారులు హిజ్రాలను దుకాణాలకు పిలిచి, దిష్టి తీయించడం ఆనవాతీగా మార్చుకున్నారు. దుకాణం వద్దకు హిజ్రాలు వస్తే అదృష్టంగా భావించి, నగదు ఇచ్చి పంపుతారు. ఎక్కడైనా వారు కనిపించినా ప్రజలు నగదు ఇచ్చి, ఆశీర్వచనం పొందుతారు.

● గ్రూపులుగా విడిపోయి దందాలు

గతంలో తమ సంఘం నాయకుల వద్దకు జిల్లావ్యాప్తంగా ఉన్న హిజ్రాలు అంతా చేరేవారు. నాయకుల మాటలు జవదాటకుండా ప్రజలను ఆశీర్వదిస్తూ వారు ఇచ్చిన నగదు తీసుకొని సంతోషంగా ఇళ్లకు చేరుకునేవారు. అయితే, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. హిజ్రాల్లో నాయకుల మధ్య గొడవలు పెరిగిపోవడంతో ఒకరిని ఒక్కరు చంపుకునే స్థాయికి వెళ్లిపోయారు. ఇటీవల కొడవలూరు వద్ద హిజ్రాల సంఘం నాయకురాలు హాసిని హత్య కేసులో ప్రత్యర్థి వర్గానికి చెందిన హిజ్రాలను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బయట నుంచి వచ్చిన పలువురు హిజ్రాల ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారన్న ఆరోపనణ ఉన్నాయి. జిల్లాలో జరుగుతున్న హిజ్రాల దౌర్జన్యాలు, బెదిరింపులు, వేదింపలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



నెల్లూరులో దాబా హోటల్‌పై దాడి చేసిన హిజ్రాలను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

\- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)

జొన్నవాడ ఆలయ కమిటీ నియామకం

ఎక్స్ అఫిషియోతో సహా 12మందితో పాలకవర్గం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలోని మల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయానికి ట్రస్టు బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎక్స్ అఫిషియో సభ్యుడితో సహా 12 మందితో పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంకు చెందిన తిరుమూరు అశోక్ రెడ్డిని ఎన్నుకోనున్నారు. సభ్యులుగా నక్కల శివకృష్ణ, తిరువాయిపాటి నందకుమార్, పెన్నతూరు సుమలత, జొన్నలగడ్డ వరలక్ష్మీ, పాలూరు చాముండేశ్వరి, కేలుకుప్ప శ్రీనివాసులు, నూరాయపాళెం ప్రత్యూష, ముంగర సుధాకర్, రామాయణం సుధారాణి, కోళ్ళపూడి శారద, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వారణాసి వెంకట శివ గంగా ప్రసాద్ నియమితులయ్యారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో డీఎస్సీ ఎంపిక జాబితా

● అభ్యంతరాలు ఉంటే తెలపండి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాలను విడుదల చేసి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ఆర్. బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులపై ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలున్నా అక్టోబరు 25వ తేదీలోపు జోన్, రాష్ట్రస్థాయి గ్రీవెన్స్‌లో తెలియచేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం జిల్లాస్థాయి పోస్టుల ఎంపికకు సంబంధించి జోనల్ కమిటీ, రాష్ట్రస్థాయి పోస్టులకు రాష్ట్ర కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ రెండింటిలోనూ సంతృప్తి చెందని వారు పాఠశాల విద్యా సంచాలకులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. వచ్చిన సమస్యలన్నిటినీ 30 రోజుల్లో పరిష్కరిస్తారని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

విధులకు రాకపోయినా

రూ.24.62 లక్షల జీతం!

అవినీతి, ఆరోపణలకు కేంద్ర బింధువైన వైద్య ఆరోగ్య శాఖలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఓ మెడికల్ ఆఫీసర్ ఏకంగా 31 నెలలపాటు విధులకు డుమ్మా కొట్టారు. అయితే, ఆయనకు ప్రతి నెలా ఠంచనుగా ప్రభుత్వ నిధులను జీతంగా చెల్లించారు. అది కూడా రూ.వందలు, వేలల్లో కాదు.. రూ.24.62 లక్షలు దోచిపెట్టారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ విధానం నడవగా, ప్రస్తుత ప్రభుత్వంలో బ్రేకులు పడ్డాయి. ఈ భారీ స్కామ్‌పై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు విచారణాధికారిని నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ శుక్రవారం జీవో నెం.640 విడుదల చేసింది.

- ఓ మెడికల్ ఆఫీసర్ 31 నెలలపాటు డుమ్మా
- అయినా ఠంచనుగా ప్రతీ నెలా వేతనం
- పూర్వపు డీఎంహెచ్‌వో పెంచలయ్య నిర్వాకం
- నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది డిప్యుటేషన్లు
- చార్జస్ ఫ్రేమ్.. విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో సుదీర్ఘకాలం డీఎంహెచ్‌వోగా పనిచేసిన పెంచలయ్యపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. కృష్ణాపురం పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వంశీకృష్ణ సుమన్ ఎండీ (పీడియాట్రిక్స్) చదువుకునేందుకు 2022, మే నెలలో నారాయణ మెడికల్ కాలేజీలో మేనేజ్‌మెంట్ కోటాలో చేరారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. అయినా ప్రతి నెలా ప్రభుత్వం నుంచి ఆయనకు జీతం చెల్లించారు. ఈ విషయంలో పూర్వపు డీఎంహెచ్‌వో పెంచలయ్య నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రభుత్వం అభియోగాన్ని నమోదు చేసింది. వంశీకృష్ణ పీజీ కోర్సులో చేరాక డీఎంహెచ్‌వో పెంచలయ్య ఏడుసార్లు మెడికల్ ఆఫీసర్లతో సమావేశాలు నిర్వహించారు. కానీ ఏ ఒక్క సమావేశానికి వంశీకృష్ణ హాజరుకాలేదు. అయినా డీఎంహెచ్‌వో పట్టించుకోలేదన్నది ప్రభుత్వ అభియోగం. ఇక ఈ సమయంలోనే కన్సాలిడేటెడ్ పేమెంట్‌తో విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణకు అప్పటి డీఎంహెచ్‌వో రెగ్యులర్ పే స్కేల్‌కు మార్చారు. దీంతో జీతం కూడా పెరిగింది. ఇలా గతేడాది సెప్టెంబరు వరకూ 31 నెలల పాటు విధులకు హాజరుకాకపోయినా అప్పటి డీఎంహెచ్‌వో పెంచలయ్య సదరు ప్రతీ నెలా జీతం చెల్లిస్తూ రూ.24.62 లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ప్రభుత్వం అభియోగం మోపుతూ చార్జస్ ఫ్రేమ్ చేసింది. ఎఫ్ఆర్ఎస్ హాజరు ఉంటేనే జీతం చెల్లించాలని అప్పట్లో నిబంధన ఉన్నా వంశీకృష్ణ విషయంలో అప్పటి డీఎంహెచ్‌వో నిర్ధారించుకోలేదు. మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరుకావడం లేదన్న విషయం తెలిసినా డీఎంహెచ్‌వో తన బాధ్యతల మేర ప్రవర్తించలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.



● విరుద్ధంగా డిప్యుటేషన్లు

కాగా పెంచలయ్యపై ప్రభుత్వం మరో విషయంపైనా చార్జస్ ఫ్రేమ్ చేసింది. సిబ్బందిని డిప్యుటేషన్లపై ఒకచోట నుంచి మరోచోటకు పంపకూడదని అప్పట్లో వైద్య ఆరోగ్య శాఖ నిబంధనలు విధించింది. ఎక్కడైనా అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని నాటి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ ఉత్తర్వులను కూడా లెక్క చేయకుండా నాటి డీఎంహెచ్‌వో పెంచలయ్య ఇష్టం వచ్చినట్లు సిబ్బందిని డిప్యుటేషన్లపై బదిలీ చేసినట్లు ప్రభుత్వం అభియోగం మోపింది. 14 మంది మెడికల్ ఆఫీసర్లు, ఫార్మాసిస్టులు వంటి సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపారని వివరాలతో సహా పేర్కొంది. దీనిపై కూడా చర్యలకు చార్జస్ ఫ్రేమ్ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ చార్జస్ అన్నింటినీ ఫ్రేమ్ చేయగా, వీటిపై పెంచలయ్యను వివరణ కోరారు. ఆయన సమర్పించిన వివరణను ప్రభుత్వం తిరస్కరించింది. ఈ క్రమంలో తదుపరి చర్యల కోసం నిబంధనల మేరకు విచారణాధికారిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జోన్ రీజనల్ డైరెక్టర్ డా. పీ రాధారాణిని విచారణాధికారిగా నియమించగా, రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. కాగా విచారణ ఎదుర్కొంటున్న పెంచలయ్య ప్రస్తుతం కడపలోని 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారు.



కందుకూరు : కోవూరు రోడ్డులోని దుర్గాభవాని ఆలయంలో రూ.30,01,116 కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ



నెల్లూరు : సరస్వతీదేవి అలంకరణలో ఇరుకళల పరమేశ్వరి

కరెన్సీ నోట్లతో అమ్మణ్ణి వైభోగం

వివిధ రూపాలలో కొలువుదీరుతున్న అమ్మవార్లు కనులవిందు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శుక్రవారం అభిషేకాలు, విశేష నవావరణ పూజలు, కన్యకపూజలు, చండీ హోమం తదితర పూజలు వేడుకగా జరిగాయి.

కందుకూరులోని దుర్గాభవాని అమ్మవారు రూ.30.01 లక్షల కరెన్సీ నోట్లతో ముచ్చటగొలిపారు. నెల్లూరు నగరంతోపాటు పెంచలకోన, జొన్నవాడ, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● సమస్యలుంటే తెలియజేయండి : జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వరి కోతలు జరుగుతున్న ప్రతి గ్రామంలోనూ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటిం చిన మద్దతు ధరకు ఈ కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. గ్రేడ్-ఏ రకం పుట్టి రూ.20306, సాధారణ రకం ధాన్యాన్ని పుట్టి రూ.20136 ధరకు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులంతా ఈ అవశాకాన్ని సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని జేసీ కోరారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలుంటే రైతులు 8520879979 నంబర్‌కు ఫోన్ చేయవ చ్చని తెలిపారు.



దెబ్బ తిన్న వరి పైరును చూపిస్తున్న రైతులు

మాకేంటి.. ఈ ఖర్మ!

చెరువు తూము ద్వారా నీరు విడుదల.. దెబ్బ తిన్న వరి

లింగరాజు అగ్రహారం రైతుల ఆవేదన

జలదంకి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): 'ఆరుగాలం కష్టపడి వరి పండిస్తే.. తీరా పంట కోసే సమయంలో చెరువు తూము బార్లా ఎత్తేశారు. దీంతో నీరంతా పొలాల్లోకి చేరడంతో వరి దెబ్బ తినింది. నారు కోయలేక నానా ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఈ ఖర్మ ఏంటి?' అంటూ జలదంకి మండలం లింగరాజు అగ్రహారం రైతులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలోని చెరువు కింద 150 ఎకరాల వరకు ఎడగారు సాగు చేశారు. కోతల కారణంగా చెరువు తూమును రైతులు కొందరు మూసేశారు. అయితే చేపల పెంపకానికి వేలంలో దక్కించుకున్న కొందరు వర్షాలు కురుస్తుండడంతో ఉన్న చేపలను పట్టి అమ్ముకోవాలనే ఉద్దేశంతో మూసిన తూమును తెరిపించి, నీటిని కిందకు వదిలేశారు. దీంతో ఈ నీరంతా పొలాల్లోకి చేరడంతో వరికోతలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అతి కష్టంతో యంత్రాలను పొలాల్లోకి తీసుకెళ్ళి వరికోతలు సాగిస్తున్నారు. ఒక ట్రక్కుకు 2, 3 ట్రాక్టర్ ఇంజన్లు జోడించి ధాన్యం బయటకు తెచ్చుకుంటున్నారు. చేపల పెంపకం పాటదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

29న ఈపీఎఫ్ సమస్యలు పరిష్కరించుకోండి!

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న నెల్లూరులో పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా ఈపీఎఫ్ అధికారి డీ. కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భవిష్య నిధిని చెల్లించే వారి కోసంగా నిధి ఆప్కె నిఖత్-2 కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని వేదాయపాళెంలో ఉన్న లిల్లీ లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్‌కు సంబంధించిన ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటర్ కళాశాలలకు 28 నుంచి దసరా సెలవులు

నెల్లూరు (విద్య) :జిల్లాలోని జూనియర్ కళాశాలలకు ఈ నెల 28 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటిస్తున్నట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల కింద పనిచేసే ఇంటర్ కళాశాలలన్నీ ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

త్వరలో కొత్త పంచాయతీలు!

వచ్చే ఏడాది గ్రామ సమరం ● ఎన్నికల్లోపు విభజనకు కసరత్తు ● ప్రతిపాదనల స్వీకరణ ● పెరగనున్న సర్పంచ్ పదవులు

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య పెరగనుందా..?, కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయా.. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవులు పెరగనున్నాయా... అంటే ఇందుకు అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనప్రాయంగా సంకేతాలు ఇవ్వడంతో జిల్లాలోని పల్లెల్లో హడావిడి మొదలైంది. ప్రస్తుత పంచాయతీ పాలక మండళ్ల కాల పరిమితి వచ్చే ఏడాది ఏప్రిల్ 2 నాటికి ముగియనుంది. ఈలోపే ఎన్నికలు నిర్వహించాలని, అందుకు సర్వం సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ నుంచి ఇటీవల జిల్లా అధికార యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. పోలింగ్ బూత్‌లు, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా, పంచాయతీల విభజన తదితర ఏర్పాట్లకు సంబంధించి షెడ్యూల్‌ని ప్రకటించింది. అందుకు అనుగుణంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



● కొత్త పంచాయతీలకు ప్రతిపాదనలు

ఎన్నికల కమిషన్ సూచనల మేరకు పంచాయతీల విభజన ప్రతిపాదనలు పంపాలని ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారి నుంచి ప్రతీ పంచాయతీకి ఉత్తర్వులు వెళ్లాయి. దీంతో పంచాయతీల విభజనపై రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఉదయగిరి నియోజకవర్గం నుంచి 9 పంచాయతీల విభజనకు ప్రతిపాదనలు వచ్చాయి. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం నుంచి ఆరు పంచాయతీలు, కొడవలూరు మండలం నుంచి రెండు, సంగం మండలం నుంచి ఒకటి చొప్పున ప్రతిపాదనలు జిల్లా పంచాయతీ కార్యాలయా నికి వచ్చాయి. ఇంకా అనేక మండలాల నుంచి ప్రతిపాదనలు రానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 941 పంచాయతీలు ఉండగా జిల్లాల విభజనతో ఆ సంఖ్య 722కు తగ్గింది. తాజా పరిణామాలతో పంచాయతీల సంఖ్య మళ్లీ పెరిగే అవకాశం ఉంది. ప్రతిపాదనలకు డిసెంబరు 3వ తేదీ వరకు గడువు ఉంది.

● 3 కి.మీ.. 3 వేల జనాభా..

ప్రస్తుత పంచాయతీ నుంచి కనీసం మూడు కిలోమీటర్ల దూరం, మూడు వేల జనాభా కలిగి ఉంటేనే కొత్త పంచాయతీ ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ నిబంధనలకు లోబడిన ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తుంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	232

కోడిగుడ్ల ధర (100) : 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10,851
వెండి కిలో ధర	రూ. 1,42,000
వెండి ఒక గ్రాము	రూ.145.00

కార్మిక చట్ట సవరణ బిల్లు ఆపాలి

కావలి (టౌన్) సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కార్మికులకు 10 గంటల పని విధానంపై అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమని, కార్మిక చట్ట సవరణ బిల్లు ఆపాలని శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ట్రంకు రోడ్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రెహనాబేగం, పెంచలయ్య, కృష్ణమోహన్, తిరుపాలు, మధుసూదన్‌రావు, యూనియన్ నాయకులు క్రాంతికుమార్, సుభాషిణి, జయంతి, చిన్నమ్మ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జాషువా సాహితీ పురస్కారానికి మస్తానయ్య ఎంపిక

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంగీత, సాహిత్య వేదిక అధ్యక్షుడు, తెలుగు ఉపాధ్యాయుడు, స్నేహ మధురిమలు పుస్తక రచయిత ఇనకొల్లు మస్తానయ్య జాషువా సాహితీ పురస్కారానికి ఎంపికైనట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీన గుర్రం జాషువా జయంతి సందర్భంగా గుంటూరులో జరిగే కార్యక్రమంలో మస్తానయ్యకు పురస్కారం అందించనున్నట్లు పేర్కొన్నారు. తనను జాషువా సాహితీ పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులకు మస్తానయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారులపై దౌర్జన్యం చేస్తే చట్టపరమైన చర్యలు : సీఐ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులపై దౌర్జన్యం చేసి డబ్బులు వసూలుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కందుకూరు సీఐ అన్వర్ బాషా శుక్రవారం హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. షాపుల ప్రారంభోత్సవాలు, వివాహలు, శుభకార్యాలకు వెళ్లినప్పుడు, ఇతరుల వద్దకు వెళ్లినప్పుడు కానీ బలవంతంగా డబ్బులు వసూలుచేయడం, వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం చేయకూడదని, వారికైవారు డబ్బులు ఇస్తేనే తీసుకోవాలని, వారి నుంచి బలవంతంగా డబ్బులు లాక్కోవడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

పాథాలజిస్టు పోస్టు భర్తీ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పాథాలజిస్టు (వ్యాధి నిర్ణయ శాస్త్రవేత్త) పోస్టు భర్తీ చేస్తూ శుక్రవారం వైద్యఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పశ్చిమ గోదావరి జిల్లా, అనపర్తి ఏరియా ఆసుపత్రి నుంచి పాథాలజిస్టు డాక్టర్ దినేష్ కింకెర్‌ని కందుకూరు ఏరియా ఆసుపత్రికి నియమిస్తు ఉత్తర్వులు జారీ అయినట్లు అధికారులు తెలిపారు.

నాణ్యమైన పొగనారు ఉత్పత్తి చేయాలి

కలిగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొగాకు నారుమళ్లు సాగుచేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన నారును ఉత్పత్తి చేయాలని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. బోర్డుపరిధిలోని జువ్వలగుంటపల్లిలో శుక్రవారం పొగాకు నారుమళ్లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి మాత్రమే పొగాకు ఎగుమతులు ఉంటాయన్నారు. బోర్డు అనుమతించిన మేర మాత్రమే పొగాకు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంల్లో ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, ఐటీసీ, జీపీఐ కంపెనీ ప్రతినిధులు గోలి వెంకటేశ్వర్లు, ఆలీ, బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో భద్రకాళి



కలిగిరి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెల్లపాడు గ్రామంలో భద్రకాళి అమ్మవారు శుక్రవారం భక్తులకు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. శతనామావళి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మారెళ్ళ పెదమాల్యాద్రిరెడ్డి, పద్మావతి, మహదేవరెడ్డి, మమత ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఏఎస్ పేట మండలం, చౌటభీమవరం వాస్తవ్యులు చింతపట్ల అంకయ్య, పూర్ణలక్ష్మీ దంపతులు రూ.10 వేల విలువైన వెండి తీర్థపాత్రను ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు శ్రీనివాసాచార్యులకు అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి వేదాశీర్వచనం అందజేశారు.

బిట్రగుంట: బోగోలు మండలంలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రుల సదర్భంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశ్వనాథరావుపేట పంచాయతీ కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీదేవి మహాలక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. బోగోలు రాజావీధి షిరిడి సాయిబాబు మందిరం, రామస్వామిపాలెం జ్ఞాన ప్రసూనాంబ పమేత రామలింగేశ్వర స్వామి, చెంచులక్ష్మీపురం పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అల్లూరు : శుక్రవారం అల్లూరులోని పార్వతీ అమ్మవారి దేవాలయం (దసరా దేవాలయం)లో పార్వతీ అలంకారంలో అమ్మవారు రథంలో గ్రామోత్సవానికి తరలివెళ్లారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ, కన్యకా పరమేశ్వరి, వృక్ష పోలేరమ్మ ఆలయాల్లో శుక్రవారం రాత్రి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కావలి (టౌన్): దేవీ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నంది వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవి అలంకారంలో, కొత్త బజారులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలకారంలో దర్శనమిచ్చారు. మహిళా భక్తుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బృందావనం కాలనీలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగం గా శుక్రవారం శ్రీవారు సింహ వాహన, ముత్యపు పందిరి వాహన సేవలందుకున్నారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షులు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల యాగ్నికస్వామి పరాంకుశం చినవెంకటస్వామి యాగ్నికంలో టీటీడీ ఆచార వ్యవహారాలతో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం శ్రీవారికి సింహ వాహన, రాత్రి ముత్యపు పల్లకి వాహన సేవలందించారు. శనివారం ఉదయం స్వామివారికి కల్పవృక్ష వాహన ఉత్సవం, రాత్రి సర్వభూపాల వాహన ఉత్సవం జరగనున్నాయి.

రూ.30లక్షల కరెన్సీతో అలంకరణ

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని కోవూరు రోడ్డులో వేంచేసి ఉన్న దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు, ఆలయ నిర్వాహకులు రూ.30,01,116 కొత్త కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. విశేష అంకరణలో అమ్మవారు భక్తులకు కనువిందు చేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పణ



కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రుల సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పించారు. ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు కందుకూరు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాల అధ్యక్షుడు కోట నరసింహంతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా పల్లపోతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా బొగ్గవరపు సుబ్బారావు ఎన్నికైన సందర్భంగా జిల్లాలోని అన్ని వాసవి అమ్మవార్లకు సారె సమర్పించాలనే తలంపుతో మొదటిగా కందుకూరుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. తొలుత పట్టణంలోని పొట్టిశ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

లక్ష్మీదేవి అలంకారంలో అంకమ్మతల్లి

లింగసముద్రం, సెప్టంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం స్థానిక అంకమ్మతల్లి దేవస్థానంలో లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విలేకరి స్థలం కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జర్నలిస్టులకు పట్టాలు పంపిణీ చేసిన స్థలాలకే రక్షణ లేకుంటే సామాన్య ప్రజల ఆస్తులకు రక్షణ ఏవిధంగా చేపడతారని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన కందుకూరు ఆంధ్రజ్యోతి సీనియర్ విలేకరి కొల్లూరి హరిబాబు స్థలాన్ని పరిశీలించిన ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొని, రెవెన్యూ, పోలీసు అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని ప్రకటనలో కోరారు.

కరేడు భూసేకరణ బిల్లు రద్దు చేయాలి

● సీపీఐ నిరసన

కందుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఇండో సోలార్ కంపెనీ భూసేకరణకు ఇచ్చిన జీవో.43ను రద్దు చేయాలని, కరేడు రైతులకు న్యాయం చేయాలని భారత కమ్యునిస్టు పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దామ అంకయ్య మాట్లాడుతూ కరేడులో ఇండో సోలార్ కంపెనీకి భూసేకరణ విషయంలో జూలై 4న జరిగిన గ్రామసభలో గ్రామస్థులంతా భూములు ఇవ్వమని తీర్మానం చేసినా, ప్రభుత్వం బెదిరించి భూమలు తీసుకుంటోందని, భూములు ఇవ్వని వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. బాధిత రైతులను పరామర్శించడానికి గ్రామాల్లోకి వెళ్లకుండా పోలీస్ 30 యాక్ట్ విధించడం శోచనీయమన్నారు. నిరసన కార్యక్రమం అనంతరం సబ్ కలెక్టర్ దామెర హిమవంశీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధు, నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాన్‌వాజ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిషోర్, సాల్మన్‌రాజ్, కొండలరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం : డాక్టర్ శ్రీనివాసులు

కావలి రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని చౌదరిపాలెంలో టీడీపీ నాయకులు గోరంట్ల రాంబాబు, పోకూరు రాంబాబు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 'స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్' సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. తుమ్మలపెంట వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హిమదీప్తి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ప్రత్యేక స్టాల్ ద్వారా పౌష్టికాహార ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సుమారు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు గోరంట్ల రాంబాబు, పోకూరు రాంబాబు, మండువ వాసు, బత్తుల రవి, గొంది చందు, మందలపు వెంకట సుబ్బయ్య, చిడిపోతు వెంకటేశ్వర్లు, కోడెల క్రిష్ణ, మండువ శ్రీనివాసులు, కారుమూడి కిరణ్, మండువ శ్రీనివాసులు, యార్లగడ్డ జీవన్, కంటు రమేష్‌బాబు, కొర్ర పాటి శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

లింగసముద్రం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు పౌష్టిహారంపై అంగన్‌వాడీల ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దపవని సెక్టారులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజాత శిశువు, కిశోర బాలికలు పట్ల చూపాల్సిన శ్రద్ధాశక్తుల గురించి తల్లులకు వివరించినట్లు సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య రక్షణే ధ్యేయం

బిట్రగుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య రక్షణే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమని కోవూరుపల్లి వైద్యులు రామకృష్ణ, నళిని పేర్కొన్నారు. కోవూరుపల్లి ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.

బిట్రగుంట అభివృద్ధిపై 'దగుమాటి' గళం హర్షణీయం

బిట్రగుంట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే ప్రాంతంలో లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేయాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అసెంబ్లీలో గళం వినిపించడం హర్షణీయమని టీడీపీ మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ పాలనలోనే రామయ్యపట్నం హార్బర్, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. సమావేశంలో కూటమి నాయకులు ఎన్ శ్రీని వాసులు యాదవ్, ఎల్ సుధీర్‌బాబు, జీ నాగరాజు, మస్తాన్‌నాయుడు, బాషా, బిట్రగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి పీ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో వసతుల పరిశీలన



సచివాలయంలో వసతులను పరిశీలిస్తున్న పీడీ నాగరాజకుమారి

ఉదయగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సచివాలయం-3ని శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్-2047లో భాగంగా ఉదయగిరి నియోజకవర్గానికి తాను ప్రత్యేకాధికారిణిగా వ్యవహరిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో ఓ కేంద్రాన్ని ఏర్పాటుచేసి అక్కడనుంచి 8 మండలాల్లో కార్యకలాపాలు కొనసాగించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగా వింజమూరు, ఉదయగిరి సచివాలయాల్లో వసతులు పరిశీలించినట్లు, నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి అనంతరం కేంద్రం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పంచా యతీరాజ్ ఏఈ శ్రీనివాసరాజు, వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐలమ్మ సేవలు ఎనలేనివి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రజకుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన చాకలి ఐలమ్మ సేవలు ఎనలేనివని మండల రజక సంఘం అధ్యక్షుడు మాచర్ల గురవయ్య అన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కంచర్ల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు యాదగిరి హజరత్, సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు యాదగిరి ప్రసాద్, యాదగిరి తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాలను, నీటి తొట్టెలను పరిశీలించి వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మవారి అలంకారాలు

భక్తిశ్రద్ధలతో భక్తుల పూజలు



వరికుంటపాడులో సంతానలక్ష్మి అలంకారంలో నాగరప్పమ్మ



తూర్పురొంపిదొడ్లలో స్కందమాత అలంకారంలో మానసాదేవి



సంగం : కాత్యాయనిదేవి అలంకారములో శ్రీ కామాక్షీదేవి



ఆత్మకూరు : అన్నపూర్ణాదేవి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు

ఉదయగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు ప్రత్యేక అలంకారాలలో భక్తులకు కనువిందు చేశారు. ఈసందర్భంగా పట్టణంలోని పార్వతీపరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీపరమేశ్వరాలయంలో రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు స్కందమాత అలంకరణలో, వరికుంటపాడులోని నాగరప్పమ్మ సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

● **సంగం :** స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరాలయంలో అమ్మవారు శుక్రవారం రాత్రి లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరించారు. పల్లకీసేవ నిర్వహించారు.

● **ఆత్మకూరు :** పట్టణంలోని ఉత్తర బలిజ వీధిలో ఉన్న జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **సీతారామపురం:** మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో, గ్రామదేవత అంకాలమ్మ గుడి నారాయణమ్మపేట విజయ కనకదుర్గాదేవి ఆలయాలలో, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి అమ్మవారు మహలక్ష్మీ అలంకారంలో భక్తులకు శుక్రవారం దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాలమ్మ గుడి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళలకు ఆరోగ్య సంరక్షణ పరీక్షలు



అంగన్‌వాడీలు చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా మహిళలకు ఆరోగ్య సంరక్షణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి ఆయేషా తెలిపారు. శుక్రవారం తూర్పుకొండారెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించి అభినందనలు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు, వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచు ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు ఖాశింబీ, రేష్మ, కార్యకర్తలు తిరుపతమ్మ, రజియా, మిరియమ్మ, పద్మావతి, చిన్నమ్మ, శైలజ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

సీతారామపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ షేక్ ఫజిహా అన్నారు. ఆమె శుక్రవారం సింగారెడ్డిపల్లి బీసీ కాలనీలో సర్వే నంబర్ 96లోని వివాదాస్పదమైన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో యంత్రాలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుభాని, సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్వో వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనంతో కార్మికులకు ఒరిగిందేమీ లేదు : ఎస్‌డబ్ల్యూఎఫ్



మహాసభలో మాట్లాడుతున్న కట్టా సుబ్రహ్మణ్యం

ఉదయగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా కార్మికులకు ఒరిగిందేమీలేదని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఉదయగిరి డిపో ఎస్‌డబ్ల్యూఎఫ్ 10వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో చేపట్టిన వేతన సవరణ వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. 20 శాతం ఉన్న హెచ్‌ఆర్‌ఏ 16 శాతానికి తగ్గించారన్నారు. గత ప్రభుత్వం కార్మికులకు సరైన పద్ధతిలో న్యాయం చేయకపోవడంతో కార్మికులంతా కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారన్నారు. వారు కూడా అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో కాలయాపన చేస్తున్నారన్నారు. అనంతరం 13 మంది సభ్యులతో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రాజశేఖర్, ఏ.కృష్ణయ్య, యస్థానిబాషా, రవి, కాకు వెంకటయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గు చూపాలి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబు 26 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఆదాయం కలిగిన చిరుధాన్యాల సాగు చేసి లాభాలు పొందాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురంలో జొన్నపంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాల వాడకం అధికమైందని, ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్, వీఏఏ దినేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): పంటల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జీ.కొండారెడ్డిపల్లిలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంట సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే పంటకు వ్యాపించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

సంగం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాదొరెడ్డి పేర్కొన్నారు. స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ పథకంలో భాగంగా గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ అశోక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా సిద్దీపురం గ్రామంలో మధ్యాహ్నం వైద్య శిబిరం నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

సీతారామపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను మండల వైసీపీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, దంతిక జయపాల్ , గిరి, కొండయ్య, పిచ్చయ్య. ఓబులేస్. ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలు

సీతారామపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామ సమీపాన గల జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పబ్బులేటిపల్లి నుంచి సీతారామపురానికి బయలుదేరిన ఆటో మార్గమధ్యంలో జాతీయ రహదారిపై అడ్డొచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడింది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న సీతారామపురం గ్రామానికి చెందిన వీరపోగు బాబు, నారాయణలకు గాయాలు కాగా 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరిసాగుపై రైతులకు అవగాహన

అనంతసాగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో శుక్రవారం వరిసాగును వ్యవసాయాధి కారులు పరిశీలించారు. ఎన్ని రోజులకు కోత కోయాలి, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శైలజా కుమారి, ఏఈవో కృష్ణవేణి పాల్గొన్నారు.